

కాళీశ్వరి, చెల్లమ్మాళ్, ఇద్దరు చిన్నారులు (ఫైల్‌ఫొటో)

ఆయువు తీసిన అవమానం

● ఒకే కుటుంబానికి చెందిన నలుగురి బలవన్మరణం

టీ.నగర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లా చిన్న కుళిపట్టి గ్రామంలో ఓ మహిళ భర్తను వదిలేసి, పరాయి వ్యక్తితో వెళ్లిపోవడాన్ని అవమానంగా భావించిన ఆమె కుటుంబం బలవన్మరణానికి పాల్పడింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా.. చిన్న కుళిపట్టి గ్రామంలోని ఓ ఇంటిలో చెల్లమ్మాళ్ (65), ఆమె కుమార్తె కాళీశ్వరి (45) నివసిస్తున్నారు. కాళీశ్వరి కుమార్తె పవిత్ర (28)కు కరూరు జిల్లాకు చెందిన ప్రభాకరన్ అనే యువకుడితో తొమ్మిదేళ్ల క్రితం వివాహమై, ఇద్దరు కుమార్తెలున్నారు. ఈ నేపథ్యంలో భర్తతో ఘర్షణ పడిన పవిత్ర.. తన బిడ్డలతో సహా నెల రోజుల క్రితం పుట్టింటికి వచ్చింది. ఈ నేపథ్యంలో పళ్లపట్టికి చెందిన ఓ యువకుడితో ఆమెకు వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ పరిస్థితుల్లో పవిత్ర మంగళవారం సాయంత్రం తన ఇద్దరు కుమార్తెలను వదిలి ఆ యువకుడితో పరారైంది. ఈ విషయం తెలుసుకున్న పవిత్ర తల్లి కాళీశ్వరి, బామ్మ చెల్లమ్మాళ్ అవమానభారంతో క్రుంగిపోయారు. ఆ తర్వాత మంగళవారం రాత్రి చెల్లమ్మాళ్ తన కుమార్తె కాళీశ్వరి, ఆమె మనవరాళ్లు లితిక (7), దీప్తి (5)కి విషమిచ్చి హతమార్చింది. అనంతరం తానూ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. బుధవారం ఉదయం చెల్లమ్మాళ్ ఇంటి నుండి ఎలాంటి అలికిడి వినిపించకపోవడంతో చుట్టుపక్కలవారు వెళ్ళి చూడగా కాళీశ్వరి, ఆమె మనవరాళ్లు నురగలు కక్కుకుని నేలపై శవాలుగా పడి ఉండటం, చెల్లమ్మాళ్ శవంగా వేలాడుతుండం చూసి దిగ్ర్భాంతి చెంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇడయ్యికోట పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని నలుగురి మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నివాసం కోసం దిండుగల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు జరుపుతున్నారు.



రాజధాని చెన్నైలో ట్రాఫిక్ రద్దీ నియంత్రించేలా, నగర సరిహద్దుల రోడ్ల పథకం ప్రారంభమైన నేపథ్యంలో, ఎన్నూర్ నుంచి మహాబలిపురం పూంజేరి వరకు రూ.27,600 కోట్లతో 92 కి.మీ మేర సముద్రంలో 'ఈసీఆర్ సముద్ర మార్గం వంతెన' ఏర్పాటుకు రాష్ట్ర రహదారుల కమిషన్ నిర్ణయించింది. ఈ ప్రాజెక్ట్ సాధ్యాసాధ్యాల నివేదిక తయారీకి రూ.3.80 కోట్లు కేటాయించింది.

- పెరంబూర్, ఆంధ్రజ్యోతి

● ఎన్నూర్ నుంచి పూంజేరి వరకు 92 కి.మీ మేర నిర్మాణం

● మూడు విడతలుగా రూ.27.600 కోట్లతో ప్రాజెక్ట్

సాగరంపై సేతువు

బైపాస్ రోడ్లు...

చెన్నై మాత్రమే కాకుండా తిరువళ్లూర్, కాంచీపురం, చెంగల్పట్టు జిల్లాల్లో కర్మాగారాలు పెరుగుతున్న నేపథ్యంలో, పొరుగు రాష్ట్రాలు, రాష్ట్రంలోని ఇతర జిల్లాల నుంచి ఉపాధి కోసం వచ్చే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. దీంతో, వాహనాల రద్దీ పెరగడంతో, రోడ్ల విస్తరణ, కొత్త రోడ్ల ఏర్పాటు తదితరాలను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. నగర, శివారులో ట్రాఫిక్ రద్దీ నియంత్రించేలా వండలూరు-మీంజూరు అనుసంధానిస్తూ 62 కి.మీ బైపాస్ రోడ్డును రహదారుల అభివృద్ధి సంస్థ పర్యవేక్షిస్తోంది. అలాగే, పెరుంగళత్తూర్-పుళల్ ప్రాంతాలు అనుసంధానం చేస్తూ 32 కి.మీ ఉన్న చెన్నై బైపాస్ రోడ్డు జాతీయ రహదారుల కమిషన్ పరిధిలో, మనలి నుంచి కోయంబేడు మీదుగా వేళచ్చేరి వరకు 25 కి.మీ రోడ్డు రాష్ట్ర రహదారుల కమిషన్ పరిధిలో ఉన్నాయి. ఈ రోడ్లు నగరంలోని అన్ని ప్రాంతాలు అనుసంధానం చేసేలా రూపొందించారు. అలాగే, చెన్నై, తిరువళ్లూర్, కాంచీపురం, చెంగల్పట్టు జిల్లాలను కలిపేలా, ఎన్నూర్ నుంచి దచ్చూర్, తండలం, శ్రీపెరుంబుదూర్, సింగపెరుమాళ్ ఆలయం మార్గంగా మహాబలిపురం సమీపం పూంజేరి వరకు 133 కి.మీ మేర రోడ్డు మార్గంగా ఆరు లేన్లతో కూడిన 'చెన్నై సరిహద్దు రోడ్డు' ప్రాజెక్ట్ ప్రారంభమైంది. ఈ పనులు ఐదువిడతలుగా చేపట్టనున్నారు. మూడువిడతలకు రూ.2,700 కోట్లతో పనులు చేపట్టారు.

కొత్త ప్రాజెక్ట్...

చెన్నై, చెంగల్పట్టు జిల్లాలను అనుసంధానిస్తూ, ఎన్నూర్ నుంచి పూంజేరి వరకు 92 కి.మీ సముద్రం మార్గంలో రోడ్డు నిర్మించేందుకు రాష్ట్ర రహదారుల కమిషన్ నిర్ణయించింది. ఈ ప్రాజెక్ట్ సాధ్యాసాధ్యాలపై సమగ్ర నివేదిక రూపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.3.80 కోట్లు కేటాయించింది. ఈ ప్రాజెక్ట్‌పై రహదారుల శాఖ మంత్రి వేలు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ ప్రాజెక్ట్ వ్యయం రూ.27,600 కోట్లుగా నిర్ణయించారు. ఈ రోడ్డుకు 'ఈసీఆర్ సముద్ర మార్గం వంతెన (ఈసీఆర్ కడల్ వళి మేంబాలం) అనే పేరు సూచించారు. రాష్ట్రంలో ఈసీఆర్ అనబడే ఈస్ట్ కోస్ట్ రోడ్డు ప్రధాన రోడ్డుగా ఉంది. చెన్నై నుంచి కన్నియాకుమారి వరకు ఉన్న రోడ్డును విస్తరించాలని నిర్ణయించి, మహాబలిపురం నుంచి నాగపట్టణం వరకు నాలుగు లేన్ల రహదారి పనులు జరుగుతున్నాయి. నాగపట్టణం నుంచి కన్నియాకుమారి వరకు రోడ్డు విస్తరణ పనులు కూడా వేగవంతమయ్యాయి. ఈ రహదారి ఏర్పాటుతో చెన్నై, తూత్తుకుడి హార్బర్లు అభివృద్ధితో పాటు సముద్రతీర ప్రాంతాల అభివృద్ధి జరుగనుంది.అలాగే, చెన్నై-తిరుచ్చి, చెన్నై-సేలం గ్రీన్ వేస్ రోడ్లు ఏర్పాటుచేయడంతో పాటు మదురై మార్గంగా తూత్తుకుడి వరకు పొడిగించాలని నిర్ణయించారు. ఈ మార్గాలకు ఈసీఆర్ సముద్ర మార్గం వంతెన ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

పారిశ్రామికాభివృద్ధి...

ఈ విషయమై రహదారుల శాఖ అధికారులు మాట్లాడుతూ... సముద్రతీర ప్రాంతాలకు ఇబ్బంది లేకుండా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వంతెన నిర్మాణపనులు చేపట్టనున్నామన్నారు. అందుకోసం సముద్రతీర పర్యావరణ పరిరక్షణ, మత్స్య సంపద, జాలర్ల సంక్షేమం పరిగణలోకి తీసుకుని, అందుకు కోస్టల్ రెగ్యులేటరీ కమిషన్ అనుమతి పొందాల్సి ఉందన్నారు. ఇప్పటికే దేశంలోని పలు ప్రాంతాల్లో సముద్ర మార్గం వంతెనలున్నాయని తెలిపారు. ఈ వంతెన ఏర్పాటుతో ఓడరేవుల్లో సరుకుల నౌక రవాణా పెరగడంతో పాటు పారిశ్రామికాభివృద్ధి చెందుతుందన్నారు. అలాగే, నగరంలోని ట్రాఫిక్ రద్దీ కూడా నియంత్రించే అవకాశముందన్నారు. ఈ ప్రాజెక్ట్ తొలివిడత పనులు రూ.5,400 కోట్లు, రెండవ విడత రూ.9,000 కోట్లు, మూడవ విడత రూ.13,200 కోట్లు చొప్పున మొత్తం ప్రాజెక్ట్ విలువ రూ.27,600 కోట్లుగా నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు.



ప్రజా వినతులపై నెలరోజుల్లో స్పందించాల్సిందే

● లేకుంటే రూ.25 వేల జరిమానా

● కలెక్టర్లు, ఉన్నతాధికారులకు హైకోర్టు హెచ్చరిక

ప్యారీస్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చిన వినతులపై నెల రోజుల్లోపు స్పందించాలని, లేకుంటే రూ.25 వేలు జరిమానా విధిస్తామని జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులను మద్రాస్ హైకోర్టు హెచ్చరించింది. మద్రాస్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కేఆర్ శ్రీరామ్ నేతృత్వంలోని ధర్మాసనంలో బుధవారం పలు కేసులపై విచారణ ప్రారంభించేముందు ఓ సీనియర్ న్యాయవాది వినతిపత్రం అందజేశారు. అందులో ప్రభుత్వానికి సమర్పించిన వినతిపత్రం పరిశీలించేలా ఉత్తర్వులు జారీచేయాలని కోరుతూ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వాజ్యంపై విచారణ జరపాలని అభ్యర్థించారు. దీనిపై స్పందించిన హైకోర్టు ప్రథమ ధర్మాసనం పలు సూచనలు చేసింది. ప్రజలు సమర్పించే వినతిపత్రాలను పరిశీలించి 30 రోజుల్లోగా సమస్యకు పరిష్కారం చూపాలని ప్రభుత్వం గతంలో స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందని గుర్తు చేసింది. అయితే ఈ ఆదేశాలను ఉన్నతాధికారులు సరిగ్గా పాటించడంలేదని అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రజా సమస్యలపై 30 రోజుల్లో స్పందించని పక్షంలో రూ.25వేలు జరిమానా విధించాల్సివస్తుందని హెచ్చరించింది. హైకోర్టు సూచనలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఈ సందర్భంగా అడ్వకేట్ జనరల్ రవీంద్రన్ పేర్కొన్నారు.





మెరీనా బీచ్ వద్ద వాటర్ డిస్పెన్సింగ్ యూనిట్ ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

● ప్రారంభించిన సీఎం

రూ.6.04 కోట్లతో వాటర్ డిస్పెన్సింగ్ యూనిట్లు

చెన్నై, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): నగరంలో మెట్రోవాటర్ బోర్డు ఆధ్వర్యంలో రూ.6.04 కోట్లతో ప్రజలు ఎక్కువ ఉండే 50 ప్రాంతాల్లో శుద్ధిచేసిన తాగునీటిని ఉచితంగా అందించే 'వాటర్ డిస్పెన్సింగ్ యూనిట్లను ముఖ్యమంత్రి బుధవారం ఉదయం ప్రారంభించారు. మెరీనాబీచ్‌లో కార్పొరేషన్ స్విమ్మింగ్ పూల్ వద్ద ఏర్పాటు చేసిన వాటర్ డిస్పెన్సింగ్ యూనిట్‌ను స్టాలిన్ ప్రారంభించి, అందులో నీటిని తాగారు. అదే సమయంలో నగరమంతా ఏర్పాటు చేసిన 49 వాటర్ యూనిట్లు కూడా వినియోగంలోకి వచ్చినట్లు మెట్రోవాటర్ బోర్డు అధికారులు తెలిపారు. మనలి, మాధవరం, తండయార్‌పేట, రాయపురం, తిరువికనగర్, అంబత్తూరు, అన్నానగర్, తేనాంపేట, కోడంబాక్కం, వలసరవాక్కం, అడయార్ కార్పొరేషన్ జోన్లలో ఎంపిక చేసిన బస్టాండ్లు, ఉద్యానవనాలు, ఆలయాలు, ప్రభుత్వ ఆస్పత్రులు, వాణిజ్య సముదాయాలు, రైల్వేస్టేషన్‌లు, పాఠశాలలు, కళాశాల ప్రాంగణాలు, మెట్రో రైల్వేస్టేషన్లు, మెరీనా బీచ్ తదితర ప్రాంతాల్లో ఈ వాటర్ డిస్పెన్సింగ్ యూనిట్లను ఏర్పాటు చేసినట్లు స్టాలిన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రులు కేఎన్ నెహ్రూ, పీకే శేఖర్‌బాబు, జీసీసీ మేయర్ ఆర్.ప్రియ, ఎంపీ దయానిధి మారన్, డిప్యూటీ మేయర్ ఎం.మహేష్‌కుమార్, నగరపాలన నీటి సరఫరా శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.కార్తికేయన్, కార్పొరేషన్ కమిషనర్ జె.కుమారగురుబరన్. మెట్రో వాటర్ బోర్డు డైరెక్టర్ డీజీ వినయన్ తదితరులు పాల్గొన్నారు.

కీలడి నివేదిక వెల్లడించకుంటే ....

● డీఎంకే ఎంపీ తిరుచ్చి శివ

పార్లమెంటును స్తంభింపజేస్తాం

ప్యారీస్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కీలడి పురావస్తు తవ్వకాల నివేదికను సవరణ లేకుండా విడుదల చేయకుంటే పార్లమెంటు సమావేశాలను స్తంభింపజేస్తామని డీఎంకే ఎంపీ తిరుచ్చి శివ కేంద్రప్రభుత్వాన్ని హెచ్చరించారు. కీలడి పరిశోధన అనుమతించాలని కోరుతూ మదురై విరగనూరు రింగ్‌రోడ్డు వద్ద డీఎంకే యువజన విభాగం నేత రాజీవ్‌గాంధీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ధర్నాలో ఎంపీ తిరుచ్చి శివ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హరప్పా నాగరికతకు ముందే తమిళుల నాగరికత ఉండేదనే విషయం పురావస్తు పరిశోధనల్లో స్పష్టమైందని, సేతు సముద్రం పథకం అమలుకు వచ్చుంటే రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థ పెరిగివుండేదని, అయితే శ్రీరాముడిపై ఉన్న భక్తితో కేంద్రప్రభుత్వం సేతు సముద్రం పథకాన్ని అటకెక్కించిందన్నారు. ఆర్ఎస్ఎస్ భావజాలంతో నడిచే ప్రధాన మంత్రి మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం, కీలడి ప్రాముఖ్యతను పూడ్చాలని నిర్ణయించినట్లు కనిపిస్తుందన్నారు. 2023 జనవరిలో కీలడి పురావస్తు తవ్వకాలపై పురావస్తు శాస్త్రవేత్త అమర్‌నాథ్ రామకృష్ణన్ సమగ్ర నివేదిక సమర్పించారని, కానీ, ఆ నివేదికను ఇప్పటివరకు బహిర్గతం చేయలేదని ఆరోపించారు కేంద్ర ప్రభుత్వం నిజంగా సమాఖ్య వ్యవస్థను గౌరవిస్తే, కీళడి దేశానికి గర్వకారణమని ప్రకటించాలన్నారు. అందుకు బదులుగా కీలడి ప్రాముఖ్యతను అడ్డుకోవడంతో పాటు జాప్యం చేస్తున్నారని శివ ఆరోపించారు. ధర్నాలో పాల్గొన్నవారంతా తమ ముఖాలకు ముఖ్యమంత్రి స్టాలిన్ ఫోటోలు ముద్రించిన మాస్కులను ధరించి కేంద్రప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. కార్యక్రమంలో డీఎంకే ఎంపీ తంగ తమిళ్‌సెల్వన్, శాసనసభ్యులు దళపతి, తమిళరసి, జిల్లా కార్యదర్శి సేడపట్టి మణిమారన్ తదితరులు పాల్గొన్నారు.



మదురైలో జరిగిన డీఎంకే యువజన విభాగం ధర్నాలో సీఎం స్టాలిన్ మాస్కులను ధరించి పాల్గొన్న పార్టీ శ్రేణులు

రైలు పట్టాలపై ఇనుప రాడ్

● ఏర్కాడు ఎక్స్‌ప్రెస్‌కు తప్పిన ముప్పు

చెన్నై, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లా శంకగిరి వద్ద రైలు పట్టాలపై గుర్తు తెలియని దుండగులు పొడవైన ఇనుపరాడ్ పెట్టడం కలకలం రేపుతోంది. ఆ మార్గంలో వెళుతున్న ఏర్కాడు ఎక్స్‌ప్రెస్‌ను కూల్చేందుకే ఈ కుట్రకు పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈరోడ్ నుండి సేలం, జోలార్‌పేట మీదుగా చెన్నై రోజూ ఏర్కాడు ఎక్స్‌ప్రెస్ నడుపుతున్నారు. మంగళవారం రాత్రి 9 గంటలకు ఈరోడ్ నుంచి ఆ రైలు బయలుదేరి సేలం జిల్లా శంకగిరి సమీపం మావేలిపాళయం స్టేషన్ దాటుకుని మకుటంచావిడి వద్ద వెళుతుండగా దాని పట్టాల కింద పొడవైన ఇనుపరాడ్ చిక్కుకుని పెద్ద శబ్దంతో ఈడ్చుకెళ్ళింది. ఆ శబ్ధం విని లోకో పైలెట్ వెంటనే రైలు నిలిపివేశారు. కిందుకు దిగి చూడగా పొడవైన ఇనుపరాడ్ చక్రాల్లో చిక్కుకుని ఉండటాన్ని గమనించారు. దీంతో ఇంజన్ మరమ్మతుకు గురైంది. వెంటనే డ్రైవర్ ఆ విషయాన్ని రైల్వే జోనల్ ఉన్నతాధికారులకు ఫోన్‌చేసి తెలిపాడు. రైల్వే అధికారులు, సేలం, ఈరోడ్ రైల్వే పోలీసులు డాగ్ స్క్వాడ్‌తో హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. ఏర్కాడు ఎక్స్‌ప్రెస్‌ను కూల్చివేయాలనే ఆలోచనతోనే గుర్తు తెలియని దుండగులు పదడుగుల పొడవైన ఇనుపరాడ్‌ను రైలుపట్టాలపై ఉంచినట్లు గుర్తించారు. దుండగులను గుర్తించేందుకు వెళ్లిన పోలీసు జాగిలం కిలోమీటర్ వెళ్ళి తిరిగొచ్చింది. ఇదిలా ఉండగా ఆ రైలును మార్గమధ్యంలో నిలిపివేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఆ తర్వాత సేలం నుండి మరో రైలింజన్‌ను తెప్పించిన మీదట ఆ రైలు రెండు గంటలు ఆలస్యంగా రాత్రి 11.45 గంటలకు బయలుదేరింది. ఈ సంఘటన కారణంగా ఈరోడ్ మార్గంమీదుగా చెన్నై, బెంగళూరు నగరాలకు వెళ్లే మూడు రైళ్లను అక్కడక్కడా నిలిపేశారు. ఆ రైళ్లు కూడా గంట ఆలస్యంగా గమ్యస్థానాల వైపు బయలుదేరాయి. ఈ సంఘటనపై రైల్వే డీఎస్పీ బాబు మాట్లాడుతూ అక్కడ మందుబాబులు మద్యం తాగి ఇనుపరాడ్‌ను పట్టాలపై వేసి వెళ్ళి ఉంటారన్నారు. ఈ ప్రాంతం గ్రామాలకు దూరంగా ఉండటం, సీసీ కెమెరాలు లేకపోవటం వల్ల దుండగులను గుర్తించడంలో కాస్త జాప్యం జరుగవచ్చని చెప్పారు.



డాగ్ స్క్వాడ్ తనిఖీ, పట్టాలపై నుంచి తీసిన ఇనుపరాడ్

కులగణన డైరెక్టర్‌గా సుందరేష్ బాబు



ప్యారీస్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల్లో కులగణన నిర్వహణ డైరెక్టర్‌గా ఐఏఎస్ అధికారి సుందరేష్ బాబు నియమితులయ్యారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఎం.సుందరేష్‌బాబు డిసెంబర్ 31వ తేదీ వరకు ఈ పదవిలో కొనసాగుతారని కేంద్రప్రభుత్వం బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల్లో 2011వ సంవత్సరం చివరగా జనగణన నిర్ణయించిన కేంద్రప్రభుత్వం 2021లో కరోనా మహమ్మారి కారణంగా ఆ సంవత్సరం ఈ నిర్ణయాన్ని వాయిదా వేసింది. ఈ నేపథ్యంలో జనగణన చట్టం సెక్షన్-3 ప్రకారం 2027, మార్చి 1వ తేదీలోపు కుల గణనతో పాటు, జనగణనను కూడా పూర్తిచేయాలని రాష్ట్రాలకు కేంద్రప్రభుత్వం ఆదేశించింది. ఈ క్రమంలో ఐఏఎస్ అధికారి సుందరేష్‌బాబు తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల కుల గణన నిర్వహణ డైరెక్టర్‌గా నియమితులు కావడం గమనార్హం.

జీహెచ్‌లో డయాలసిస్ రోగులకు పౌష్టికాహార పథకం ప్రారంభం



డయాలసిస్ రోగికి పౌష్టికాహారం అందజేస్తున్న మంత్రి సుబ్రమణ్యం

చెన్నై, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాజీవ్‌గాంధీ స్మారక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో డయాలసిస్ రోగులకు పౌష్టికాహారం అందించే ప్రత్యేక పథకాన్ని ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం ప్రారంభించారు. డయాలసిస్ వార్డులోకి వైద్యులతో పాటు వెళ్ళి రోగులకు పౌష్టికాహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ... ఆరోగ్యశాఖకు సబంధించి వార్షిక బడ్జెట్‌లో ప్రకటించిన 118 పథకాలలను ఒకొక్కటిగా అమలు చేస్తున్నామని తెలిపారు. డయాలసిస్ రోగులకు ప్రోటీన్లు అధికంగా ఉండే ఆహార పదార్థాలను అందించే పథకాన్ని ప్రారంభించామని, రాష్ట్రంలో రోజూ 9180 మంది రోగులు వివిధ ప్రభుత్వ ఆస్పత్రుల్లో డయాలసిస్ చేసుకుంటున్నారని, వారందరికీ ఈ పౌష్టికాహారాన్ని అందిస్తామని చెప్పారు. రాష్ట్రంలో 1287 డయాలసిస్ యంత్రాల ద్వారా రోగులకు సేవలందిస్తున్నామని చెప్పారు. వారంలోగా రాష్ట్రమంతటా ఉన్న ప్రభుత్వ డయాలసిస్ కేంద్రాలలో ఈ పౌష్టికాహార పథకం అమలులోకి వస్తుందని ఆయన చెప్పారు.

సమాచార దృష్టి

ఎగ్మూర్-మదురై ప్రత్యేక రైలు

పెరంబూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మదురైలో ఈ నెల 22వ తేది జరుగున్న మురుగన్ భక్తుల మహానాడుకు వెళ్లేందుకు చెన్నై ఎగ్మూర్ నుంచి ప్రత్యేక రైలు ఏర్పాటుచేసినట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. చెన్నై ఎగ్మూర్ నుంచి ఈ నెల 21వ తేది రాత్రి 9.55 గంటలకు బయల్దేరే ప్రత్యేక రైలు మరుసటిరోజు ఉదయం 5.40 గంటలకు మదురై చేరుకుంటుంది. అక్కడి నుంచి బయల్దేరి 8.45 గంటలకు తిరునల్వేలి చేరుకుంటుంది. మరుమార్గంలో 22వ తేది రాత్రి 9.40 గంటలకు తిరునల్వేలిలో బయల్దేరి 12.30 గంటలకు మదురై, అక్కడి నుండి బయల్దేరి మరుసటిరోజు ఉదయం 8.15 గంటలకు చెన్నై ఎగ్మూర్ చేరుకుంటుంది. ఈ రైళ్లకు ముందస్తు రిజర్వేషన్ ప్రారంభమైనట్లు దక్షిణ రైల్వే తెలియజేసింది.

నేడు ప్లస్‌టూ సప్లిమెంటరీ హాల్‌టికెట్ల విడుదల

ప్యారీస్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్లస్ టూ సప్లిమెంటరీ హాల్ టికెట్లను గురువారం విడుదల చేయనున్నట్లు తమిళనాడు ప్రభుత్వ పరీక్షల నిర్వహణ బోర్డు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ప్లస్‌టూ సప్లిమెంటరీ పరీక్షలకు దరఖాస్తు చేసిన ప్రైవేటు అభ్యర్థులతో పాటు ప్రభుత్వ అభ్యర్థులు బుధవారం మధ్యాహ్నం నుండి https://www.dge.tn.gov.in/ అనే వెబ్‌సైట్‌ను సంప్రదించి "hse second year అనే పదాన్ని క్లిక్ చేసి sappli-mentary exam' విభాగంలో దరఖాస్తు నెంబరు, పుట్టిన తేదీ ఎంటర్ చేసి తమకు సంబంధించిన 2025 సప్లిమెంటరీ హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. కాగా, ప్రాక్టికల్ పరీక్షల తేదీకి సంబంధించిన వివరాలను ప్రైవేటు అభ్యర్థులు తమకు కేటాయించిన పరీక్షల కేంద్ర అధికారులను సంప్రదించి తెలుసుకోవచ్చు. హాల్‌టికెట్‌లేని అభ్యర్థులను ఎట్టి పరిస్థితిలోనూ పరీక్షలు రాసేందుకు అనుమతించబోమని పరీక్షల బోర్డు స్పష్టం చేసింది.

'గవర్నర్' పురస్కారానికి దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రాజ్ భవన్ ఆధ్వర్యంలో అందించనున్న 2025 'గవర్నర్' పురస్కారానికి దరఖాస్తు చేసుకోవచ్చు. సామాజిక సేవ, పర్యావరణ పరిరక్షణ అనే విభాగల్లో ఆ కృషి చేసిన వ్యక్తులు, సంస్థల సేవలను అభినందిస్తూ ఈ పురస్కారాలు అందజేయనున్నారు. ఆసక్తి కలిగిన వ్యక్తులు, సంస్థలు ఆగస్టు 14వ తేది సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తు సమర్పించాలి. పురస్కారానికి ఎంపికయ్యే సంస్థలకు రూ.5 లక్షలు, వ్యక్తిగత విభాగంలో రూ.2 లక్షల నగదుతో పాటు ప్రశంసాపత్రం గణతంత్ర దినోత్సవం రోజున అందిస్తారు. ఆసక్తి కలిగిన వారు సంస్థలు, వ్యక్తులు https://tnrajbhavan.gov.in అనే వెబ్‌సైట్, rajbhavantwoawards2025@gmail.com అనే ఈ-మెయిల్ చిరునామాకు నిర్దిష్ట సమయంలో పంపించాలని ప్రకటన వెలువడింది.

రాష్ట్రంలో కొత్తగా 642 ఉప ఆరోగ్య కేంద్రాలు

ఐసిఎఫ్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్తగా 642 ఉప ఆరోగ్య కేంద్రాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసింది. 10వేల మంది జనాభా ఉన్న ప్రాంతాల్లో ఈ కేంద్రాలు ఏర్పాటుకానున్నాయి. ఆ ప్రకారం, గ్రామీణ ప్రాంతాల్లో 617, నగర ప్రాంతాల్లో 25 కేంద్రాలు ఏర్పాటుచేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది.

అగ్రికల్చర్ కోర్సులకు 30 వేల దరఖాస్తులు

పెరంబూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయం, అన్నామలై విశ్వవిద్యాలయం (వ్యవసాయ విభాగం) యూజీ కోర్సుల అడ్మిషన్లకు 30,333 మంది ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకున్నారు. ఈ కోర్సుల్లో అడ్మిషన్ల ప్రక్రియ మంగళవారం ప్రారంభమైంది. దివ్యాంగులు, మాజీ సైనికుల వారసులు, క్రీడాకారుల సహా ప్రత్యేక కేటగిరీ విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన మంగళవారం ప్రారంభమై 21వ తేది వరకు కొనసాగనుంది. అనంతరం 24వ తేది ర్యాంకుల జాబితా విడుదల చేయనున్నారు. అదే రోజు 7.5 శాతం రిజర్వేషన్ సీట్లకు ఆన్‌లైన్ కౌన్సెలింగ్, జనరల్ కేటగిరీ విద్యార్థులకు 24 నుంచి 27వ తేది వరకు, ప్రత్యేక కేటగిరీ విద్యార్థులకు 27న కౌన్సెలింగ్ జరుగుతుందని తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

హిజ్రాల కోసం రెండు విడిదిగృహాలు

పెరంబూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): హిజ్రాల కోసం చెన్నై, మదురై ప్రాంతాల్లో రెండు విడిది గృహాలు ఏర్పాటుచేయనున్నారు. ఈ మేరకు చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్ధార్థ్ విడుదల చేసిన ప్రకటనలో... 'అరన్' పేరిట ఏర్పాటుకానున్న ఈ గృహాలు ఏర్పాటుకు ఆసక్తి కలిగిన స్వచ్ఛంద సంస్థలు ఈ నెల 24వ తేదిలోగా బీచ్ రైల్వేస్టేషన్ సమీపంలోని కలెక్టర్ కార్యాలయంలో ఉన్న సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని కలెక్టర్ తెలియజేశారు.

రెండు ఎయిర్ ఇండియా విమానాల రద్దు

పెరంబూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): చెన్నై-ఢిల్లీ, ఢిల్లీ-చెన్నై విమానాల నిర్వహణ కారణాలతో రద్దయ్యాయి. ప్రయాణికులకు ఈ విషయం తెలియజేడంతో పాటు వారు వెళ్లేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టారు అలాగే, చెన్నై నుంచి సింగపూర్ వెళ్లాల్సిన ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానం ఆరు గంటలు ఆలస్యంగా బయల్దేరి వెళ్లిందని అధికారులు తెలిపారు.

రూ.3.6 కోట్లతో సైదాపేట పార్క్ పునరుద్ధరణ

పెరంబూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోడంబాక్కం మండలం 140వ వార్డు సైదాపేట-కోడంబాక్కం రోడ్డులో 2016లో అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో అప్పటి చెన్నై మేయర్ సైదై దురైస్వామి అమ్మ పార్క్ ఏర్పాటుచేశారు. ప్రస్తుతం ఈ పార్క్‌ను రూ.3.6 కోట్లతో పునరుద్ధరించాలని సీఎండీఏ నిర్ణయించింది. పార్క్ పునరుద్ధరణ పనుల కారణంగా పార్క్ మూయడం లేదని, పార్క్‌కు వచ్చే వారికి ఇబ్బంది లేకుండా పనులు చేపడుతున్నామని, తొలివిడతగా టాయిలెట్ నిర్మాణం, తదుపరి స్కేటింగ్ రింగ్ ఏర్పాటుచేయనున్నట్లు అధికారులు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో 3 లక్షలు దాటిన అడ్మిషన్లు

పెరంబూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు మూడు లక్షలు దాటాయి. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు మార్చి 1 నుంచి ప్రారంభమయ్యాయి. మంగళవారం వరకు 3,12,881 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పొందారు. చెన్నైలో అధికంగా 17,985 మంది, తక్కువగా నీలగిరిలో 1,327 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పొందినట్లు పాఠశాల విద్యా శాఖ అధికారులు తెలిపారు.

రాష్ట్రంలో పెరగనున్న ఎండలు

పెరంబూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరో 48 గంటలు ఎండ తీవ్రత సాధారణం కన్నా 1నుంచి 3 డిగ్రీల వరకు పెరిగే అవకాశముందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలిపింది. అదే సమయంలో, తమిళనాడు, పుదుచ్చేరి, కారైక్కాల్‌లోని కొన్ని ప్రాంతాల్లో ఈ నెల 24వ తేది వరకు మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. రాజధాని నగరం చెన్నైలో ఆకాశం మేఘావృతంగా ఉంటూ సాయంత్రం, రాత్రి వేళల్లో కొన్ని ప్రాంతాల్లో ఉరుములతో కూడిన తేలికపాటి జల్లులు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది.

ప్రజా గ్రీవెన్స్ వినతులకు సత్వర పరిష్కారం



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న పోలీస్ కమిషనర్ అరుణ్

పెరంబూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెప్పేరిలో ఉన్న గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం ప్రజా గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ అరుణ్ పాల్గొని, ప్రజల నుంచి 22 వినతిపత్రాలు స్వీకరించారు. ఆస్తుల గొడవ, కుటుంబ కలహాలు సహా పలు సమస్యలపై ప్రజలు పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. సమస్యలు పరిష్కరానికి సత్వరం చర్యలు చేపట్టాలని సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులను కమిషనర్ అరుణ్ ఆదేశించారు.

ఎయిమ్స్ ప్రారంభం నాటికి డీఎంకే అధికారంలో ఉండదు

● తమిళిసై

పెరంబూర్,జూన్18(ఆంధ్రజ్యోతి):మదురై ఎయిమ్స్ ఆస్పత్రి ప్రారంభోత్సవ సమయానికి డీఎంకే అధికారంలో ఉండదని బీజేపీ నేత తమిళిసై సౌందర్‌రాజన్ జోస్యం చెప్పారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు తెలియజేసేలా షోలింగనల్లూర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభలో తమిళిసై మాట్లాడుతూ... ప్రపంచంలోనే శక్తివంతమైన ఆర్థికవ్యవస్థగా భారత్‌ను రూపొందించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ కృషిచేస్తున్నారని అన్నారు. ఎయిమ్స్ ఆసుపత్రి నిర్ణీత సమయంలోనే ప్రారంభించేలా పనులు వేగవంతం చేశారని, ఎన్డీఏ పాలనతో ఎయిమ్స్ ప్రారంభిస్తామని తమిళిసై సౌందర్‌రాజన్ తెలిపారు.

నోటీసు బోర్డులో విద్యా రుణం వివరాలు

వైద్య కళాశాలలకు ఎన్ఎంసీ ఉత్తర్వులు

పెరంబూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి విద్యాలక్ష్మి పథకంలో వైద్య కోర్సులు చదివే విద్యార్థులకు ఇచ్చే విద్యా రుణాల వివరాలను నోటీసు బోర్డుల్లో పెట్టాలని జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) వైద్య కళాశాలలకు ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు ఎంఎన్‌సీ విడుదల చేసిన ప్రకటనలో... ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబీఏ) మార్గదర్శకాలతో కూడిన విద్యా రుణాలు ఇచ్చేందుకు అన్ని బ్యాంకులు ముందుకురావాలని రిజర్వ్ బ్యాంక్ సూచించిందన్నారు. అర్హత కలిగిన విద్యార్థులకు సులభంగా విద్యా రుణాలు అందించేలా గత ఏడాది ప్రధాన మంత్రి విద్యాలక్ష్మి పథకం పరిచయం చేశారని తెలిపింది. రాష్ట్రంలో చెన్నై వైద్య కళాశాల, వేలూరు సీఎంసీ కళాశాల, మదురై ఎయిమ్స్, చెన్నై ఈఎస్ఐ వైద్య కళాశాల, సవిత వైద్య కళాశాల సహా దేశవ్యాప్తంగా 50 వైద్య కళాశాలలను ఈ పథకంలో చేర్చారు. ప్రస్తుతం విద్యా సంవత్సరంలో చేరే విద్యార్థులు విద్యాలక్ష్మి పథకంలో అందించే విద్యా రుణాలు పొందేందుకు వీలుగా పథకానికి సంబంధించిన వివరాలు నోటీసు బోర్డులో ఏర్పాటుచేయాలని ఎన్ఎంసీ ఉత్తర్వుల్లో పేర్కొంది.

జెండా స్తంభాలకు తలా రూ.వెయ్యి వసూలు

● మద్రాసు హైకోర్టు సిఫారసు

వాషర్‌మెన్‌పేట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఒక్కో జెండా స్తంభానికి రూ.వెయ్యి రుసుము వసూలుచేయాలని మద్రాసు హైకోర్టు సిఫారసు చేసింది. బహిరంగ ప్రదేశాలు, రోడ్లు, స్థానిక సంస్థల స్థలాల్లో రాజకీయ పార్టీలు, వాటి అనుబంధ సంఘాలకు చెందిన జెండా స్తంభాలు ఏర్పాటుచేస్తుంటాయి. ఈ వ్యవహారంపై దాఖలైన పిటిషన్ విచారించిన హైకోర్టు, జెండా స్తంభాలు తొలగించాలని ఉత్తర్వులు జారీచేసింది. అదే సమయంలో, హైకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ నేపథ్యంలో, బుధవారం ఈ కేసు మళ్లీ విచారణకు రాగా హైకోర్టు, జెండా స్తంభాలకు తలా రూ.1000 రుసుము వసూలుచేయాలని, న్యాయస్థానం ఉత్తర్వులు అమలుచేయని కలెక్టర్లు స్వయంగా హాజరుకావాల్సి వస్తుందని ఉత్తర్వులు జారీచేసింది.

కోతగిరిలో నల్ల చిరుత సంచారం



పెరంబూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లా కోతగిరి సమీపంలో నల్ల చిరుత సంచారం సీసీ ఫుటేజీలో నమోదైంది. పెరియార్ నగర్ గ్రామ పరిధిలోని అటవీ ప్రాంతంలో తరచూ ఎలుగుబంట్లు, అడవి దున్నలు, చిరుత తదితరాలు సంచరిస్తుంటాయి. ఈ క్రమంలో, సోమవారం ఈ గ్రామానికి వెళ్లే రోడ్డుపై నల్ల చిరుత సంచరించింది. రోడ్డుపై కొద్ది దూరం వెళ్లిన చిరుత, అనంతరం సమీపంలోని తేయాకు తోటల్లోకి వెళ్లింది. నల్ల చిరుత సంచరించే దృశ్యాలు ఆ ప్రాంతంలో ఏర్పాటుచేసి సీసీ కెమెరాల్లో నమోదయ్యాయి. గ్రామంలోకి జంతువులు ప్రవేశించకుండా తగిన చర్యలు చేపట్టాలని గ్రామ ప్రజలు అటవీ శాఖ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

విధుల బహిష్కరణ చట్టవిరుద్ధం

● బార్ కౌన్సిల్‌కు హైకోర్టు ఉత్తర్వులు

ప్యారీస్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): చట్టానికి విరుద్ధంగా విధులు బహిష్కరించిన న్యాయవాదుల సంఘంపై చర్యలు తీసుకోవాల్సిందిగా తమిళనాడు-పుదుచ్చేరి బార్ కౌన్సిల్‌కు మద్రాస్ హైకోర్టు మదురై బెంచ్ ఆదేశించింది. తిరునల్వేలికి చెందిన సీనియర్ న్యాయవాది జిమ్ దాఖలు చేసిన పిటిషన్‌లో తిరునల్వేలి జిల్లాలోని కోర్టుల్లో న్యాయవాదులుగా వ్యవహరిస్తున్న కొంతమంది న్యాయవ్యవస్థను, పోలీసులను బెదిరించే చర్యలకు పాల్పడుతున్నారని, మరికొంతమంది పోలీసుస్టేషన్లలో కట్ట పంచాయతీలు నిర్వహించి, సంఘ విద్రోహులకు మద్దతుగా వ్యవహరిస్తున్నారని, 90 శాతం వరకు విధులు బహిష్కరించడంపై న్యాయస్థానం విచారణ జరిపి చట్టపరమైన చర్యలు చేపట్టేలా బార్ కౌన్సిల్‌కు ఆదేశించాలని ఆయన న్యాయస్థానాన్ని కోరారు. ఈ పిటిషన్ బుధవారం న్యాయమూర్తులు ఎస్ఎం. సుబ్రమణ్యన్, మరియా గ్లీడ్ ముందు విచారణకు రాగా, ఇరుతరుపున న్యాయవాదులు హాజరై వాదించారు. ప్రజలకు సమస్యలు ఏర్పడిన సమయాల్లో మాత్రమే న్యాయవాదులు బార్ కౌన్సిల్‌ను కానీ, సంబంధిత అధికారులను సంప్రదించి సమస్య పరిష్కరింపజేసుకోవాలని, అలా కాకుండా విధులు బహిష్కరించడం చట్టవిరుద్ధమని ధర్మాసనం అభిప్రాయపడింది. ఇటువంటి చర్యలకు పాల్పడిన తిరునల్వేలి న్యాయవాదుల ఎర్లు, చిరునామాతో తమిళనాడు-పుదుచ్చేరి బార్ కౌన్సిల్‌లో ఫిర్యాదు చేయాలని, దీనిపై తక్షణ చర్యలు చేపట్టాల్సిందిగా హైకోర్టు మదురై బెంచ్ ఉత్తర్వులు జారీచేసింది.

డీఎంకే కూటమిలో చీలికలు

● మాజీమంత్రి వైగై సెల్వన్



ధర్నాలో అన్నాడీఎంకే శ్రేణులతో వైగై సెల్వన్

ప్యారీస్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): అధికార డీఎంకే నేతృత్వంలోని మిత్రపక్షాల మధ్య ఎన్నికలపై ఏకాభిప్రాయం లేనందున ఆ కూటమిలో చీలికలు ఏర్పడ్డాయని మాజీ మంత్రి, అన్నాడీఎంకే ప్రచార విభాగం కార్యదర్శి వైగై సెల్వన్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా అన్నాడీఎంకే ఆధ్వర్యంలో కాంచీపురం కార్పొరేషన్ వైఖరిని నిరసనగా కావలంగేటు సమీపంలో మాజీ ఎమ్మెల్యేలు సోమసుందరం, వాలజాబాద్ గణేశన్ అధ్యక్షతన ధర్నా జరిగింది. ఈ ధర్నాను వైగై సెల్వన్ ప్రారంభించి మాట్లాడుతూ, కాంచీపురం కార్పొరేషన్ పరిధిలో నివసిస్తున్న ప్రజలపై అధిక ఆర్థిక భారం మోపుతూ తాగునీరు, డ్రైనేజీ, ఆస్తిపన్నులను పెంచడం సరికాదన్నారు. డీఎంకే కూటమిలో ప్రస్తుతం చీలకలు ఏర్పడ్డాయని, కొన్ని పార్టీలు త్వరలోనే ఆ కూటమి నుండి బయటికొస్తాయని ఆయన నమ్మకం వ్యక్తం చేశారు.

రేపు మామిడి రైతులకు మద్దతుగా నిరాహార దీక్ష

● అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి



ప్యారీస్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మామిడి రైతుల సమస్యలను పట్టించుకోని డీఎంకే ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈ నెల 20న నిరాహారదీక్ష చేయనున్నట్లు అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి ప్రకటించారు. ఆయన బుధవారం ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో రాష్ట్రంలో వరి, చెరకు పంటల తర్వాత రైతులు మామిడి అధికంగా సాగుచేస్తున్నారని, అయినా వారికి మామిడి పండ్ల సీజన్‌లో గిట్టుబాటు ధర నిర్ణయించకపోవడం వల్ల తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ఈ ఏడాది అధిక దిగుబడి కారణంగా మామిడి పండ్ల ధర తగ్గి రైతులు నష్టపోతున్నారని, వారికి న్యాయం చేయాలని కోరుతూ అన్నాడీఎంకే ఆధ్వర్యంలో వచ్చే శుక్రవారం కృష్ణగిరి బస్టాండు సమీపంలో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిరాహారదీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

సీనియర్ న్యాయవాది ముత్తుసామి కన్నుమూత



వీకే ముత్తుసామి (ఫైల్‌ఫొటో)

టి.నగర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): సీనియర్ న్యాయవాది, సుప్రీం కోర్టు న్యాయమూర్తి ఎంఎం సుందరేష్ తండ్రి వీకే ముత్తుసామి(91) కన్నుమూశారు. ఈ రోడ్ జిల్లా మొడకురిచ్చి సమీపం ఎళుమాత్తూరు, వన్నాంపారై వక్కీల్‌తోట్టం ప్రాంతంలో నివసిస్తున్న ముత్తుసామి గత కొంత కాలంగా వృద్ధాప్య సమస్యలతో తీవ్ర అస్వస్థతకు గురైన ఈరోడ్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందారు. ఈ విషయం తెలియగానే హైకోర్టు న్యాయమూర్తులు ఎం.దండపాణి, రామకృష్ణన్ ఆ ప్రాంతానికి వెళ్ళి ముత్తుసామి భౌతికకాయంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. మంగళవారం సాయంత్రం ముత్తుసామి అంత్యక్రియలను ఆయన తనయుడు, సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఎంఎం. సుందరేష్ నిర్వహించారు. సుప్రీం కోర్టు న్యాయమూర్తి ఆర్.మహాదేవన్, హైకోర్టు న్యాయవాదులు, రాజకీయ ప్రముఖులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

పాఠశాలలకు ప్రత్యేక ఫీజు సబ్సిడీ విడుదల

పెరంబూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలకు ప్రత్యేక ఫీజు సబ్సిడీగా రూ.16.38 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందని పాఠశాల విద్యాశాఖ తెలిపింది. పాఠశాల విద్యాశాఖ పరిధిలోని ప్రభుత్వ, ఎయిడెడ్ ఉన్నత, మహోన్నత పాఠశాలల్లో 6 నుంచి ప్లస్ టూ తరగతి వరకు తమిళం, ఆంగ్లం భాషల్లో విద్యాభ్యాసం చేసే విద్యార్థుల నుంచి వసూలుచేస్తున్న ప్రత్యేక రుసుమును 2008 నుంచి రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది. ఈ ఆర్థిక లోటు భర్తీ చేసేలా పాఠశాలలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఫీజు సబ్సిడీ రూపంలో చెల్లిస్తోంది. ఆ ప్రకారం, ప్రస్తుత విద్యా సంవత్సరం రూ.16,38,08,846లను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందని, విద్యార్థుల సంఖ్యను బట్టి ఆయా పాఠశాలకు చెల్లించేలా చర్యలు చేపట్టాలని జిల్లా ప్రధాన విద్యాధికారులకు పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

తిరువేర్కాడు: వేలప్పన్ చావిడి కో-ఆపరేటివ్ నగర్, కావేరి నగర్, మారియమ్మన్ ఆలయ వీధి, దేవి నగర్, సాయి అవెన్యూ అపార్ట్‌మెంట్, మాదరవేడు పెరుమాళ్ ఆలయ వీధి, పీహెచ్ రోడ్డు, నూంబల్ నగర్, వేలప్పన్ నగర్, పద్మావతి నగర్, మేట్టు వీధి, మెహతా హాస్పిటల్. **కావనూర్:** సేక్కిళర్ నగర్, ఏరిక్కరై రోడ్డు, మలయంబాక్కం, దురైస్వామి రోడ్డు, జయం నగర్, దేవి కరుమారియమ్మన్ నగర్. **కొరట్టూర్:** పల్లా ఎన్ఆర్ఎస్ రోడ్డు, పెరుమాళ్ ఆలయ వీధి, లేక్ వ్యూ గార్డెన్, కావ్య నగర్, మేట్టు వీధి, కామరాజర్ నగర్, కన్నగి నగర్ 3 నుంచి 8 వీధులు, 2 నుంచి 4, 26 నుంచి 28వ వీధులు టీఎన్‌హెచ్‌బీ కొరట్టూరు, ఈస్ట్ అవెన్యూ, శాంతి నగర్ సెంట్రల్ అవెన్యూ, ఎంటీహెచ్ రోడ్డు, టీఎంపీ నగర్, కుబేరగణపతి వీధి, చర్చ్ రోడ్డు, అప్పాదురై సీరాలామ్ వీధి, నెహ్రూ వీధి, అన్నా వీధి, మారి అమ్మన్ ఆలయ వీధి, చావిడి వీధి, తిల్లై నగర్, వన్నియర్ వీధి, బ్రాహ్మణ వీధి, గ్రామిణి వీధి, ఆర్ఎస్ రోడ్డు, తిరుమలై నగర్

పల్లావరం: న్యూ స్ట్రీట్, అంబేడ్కర్ నగర్, మందిరి ఫ్లాట్స్, చోళవరం నగర్, భారతి నగర్ మెయిన్ రోడ్డు, భారతి నగర్ 1 నుంచి 5వ క్రాస్ వీధులు, తులుకాత్తమ్మన్ ఆలయ వీధి, పచ్చయమ్మన్ నగర్, క్వారీమేట్టు వీధి, కబిలర్ వీధి, టీచర్స్ కాలని ఎక్స్‌టెన్షన్, టెంపుల్ టౌన్ రోడ్డు, భాష్యం నవరత్న ఫ్లాట్స్, జైన్ ఫ్లాట్స్, తిరుసీర్‌మలై మెయిన్ రోడ్డు, రంగా నగర్ 1 నుంచి 6 వీధులు, సుబురాయ నగర్, కాశి గార్డన్, ఎన్ఎస్‌కే వీధి, ప్రశాంతి నగర్, భారతియార్ వీధి, మహాలక్ష్మి స్కూల్ ఏరియా, పార్వతి పురం 1,2 వీధులు, ఆదామ్ నగర్, శంకర్ నగర్ 38 నుంచి 41 వీధులు, అప్పాస్వామి, శంకర్ నగర్ మెయిన్ రోడ్డు

షోలింగనల్లూర్ డివిజన్: మేడవాక్కం పెరుంబాక్కం మెయిన్ రోడ్డు, పల్లవన్ నగర్, పాండియన్ నగర్, తిరువళ్లువర్ నగర్, వేళచ్చేరి మెయిన్ రోడ్డు, జయచంద్రన్ నగర్, ఎల్ఆర్ అవెన్యూ, పొన్నియమ్మన్ నగర్, ఆదితాంగళ్, కుమరన్ థియేటర్, గౌరివాక్కం వెంగైవాసల్ మెయిన్ రోడ్డు, సంతోషపురం, వేళచ్చేరి మెయిన్ రోడ్డు, రూబి బిల్డింగ్, ఆనంద నగర్, ఇందిరా నగర్, బాలాజీ నగర్, రంగరాజపురం, జయలక్ష్మి నగర్, మహారాజపురం, విజయనగరం రెండో మెయిన్ రోడ్డు, పార్క్ వీధులు 1,2,3, అన్నునగర్ 1,2, కోవిలంబాక్కం వడక్కుపట్టు, ధర్మభూపతి నగర్, నవీన్స్ సత్యా నగర్, సుభిక్ష అవెన్యూ, పల్లికరనై కామకోడి నగర్, లేబర్ కాలనీ, సాయి బాలాజి నగర్, సిండికేట్ కాలనీ, పల్లిక్కరణై-వేళచ్చేరి మగార్ రోడ్డు, గాంధీ వీధి, నెహ్రూ వీధి, భవానీ అమ్మన్ ఆలయ వీధి, భారతిదాసన్ వీధి, పురవాంకర ఈడబ్ల్యూఎస్

కారంబాక్కం: జై నగర్, ఆర్కాడు రోడ్డు, కుంద్రత్తూర్ రోడ్డు కొంత భాగం, ఆర్ఈ నగర్ కొంత భాగం, మౌంట్ పూందమల్లి రోడ్డు

తాంబరం: ఇరుంబులియూర్ భారతమాత వీధి, వాల్మీకి వీధి, ఏరికరై వీధి, తిరువళ్లువర్ వీధి, కందస్వామి కాలని, ఎల్ఐసీ కాలని, కులశేఖరన్ వీధి, కాశియప్పర్ వీధి, సుందరం కాలని, రాజకీల్పాక్కం మహాలక్ష్మి నగర్, రాజేశ్వరి నగర్, ధనలక్ష్మి నగర్, వేళచ్చేరి మెయిన్ రోడ్డు, రిజిస్ట్రార్ ఆఫీస్, సభై రోడ్డు, మారుతి నగర్ 2వ మెయిన్ రోడ్డు, స్వామి వీధి, రామస్వామి వీధి, మరైమలై ఆదిహాల్ వీధి మరియు అవ్వైయార్ వీధి, కిష్కింధ మెయిన్ రోడ్డు, కన్నడపాళయం, సర్వీస్ రోడ్డు (సాయి నగర్), వసంతం నగర్, సమతువ పెరియార్ నగర్, ఆర్కే నగర్, అన్నై ఇందిరా నగర్, కడప్పేరి తిరునీర్‌మలై రోడ్డు, సుందరం కాలనీ, రమేష్ నగర్, పిళ్లయార్ ఆలయ వీధి, అమర్ నగర్, రైల్ నగర్, సింగారవేలన్ వీధి, మాడంబాక్కం, పడువన్‌చేరి కొంత భాగం, సదాశివం నగర్, పెరియార్ నగర్, ముల్లై నగర్, మాడంబాక్కం ఏరియా రాధా నగర్, పరసువనాథ్ అవెన్యూ, ఏఎస్కే నగర్, అంబాళ్ నగర్, గాంధీ నగర్, యశ్వంత్ నగర్, గ్రేటర్ కైలాష్ నగర్, భాగ్యలక్ష్మి నగర్, పద్మావతి నగర్, ఆండాళ్ నగర్, భువనేశ్వరి 3,4 మెయిన్ రోడ్లు, పార్వతి నగర్ సౌత్, పద్మావతి నగర్ ఎక్స్‌టెన్షన్, మాడంబాక్కం మెయిన్ రోడ్డు కొంత భాగం

అడయార్: 1వ మెయిన్ రోడ్డు, గాంధీ నగర్, కృష్ణమాచారి రోడ్డు, గోకుల్ హెయిర్ కట్, సర్దార్ పటేల్ రోడ్డు. **రామాపురం:** వళ్లువర్ రోడ్డు, కొఠారి నగర్, మనపాక్కం, ఐపీఎస్ కాలని, అంబేడ్కర్ నగర్, ముగలివాక్కం, మౌంట్ పూందమల్లి రోడ్డు, కృష్ణవేణి నగర్, నందంబాక్కం, సీఆర్ఆర్ పురం, రామమూర్తి అవెన్యూ, మార్క్స్‌వర్త్ నగర్, ఏజీఎస్ కాలని, కొలపాక్కం, జైబాలాజి నగర్, వెంకటేశ్వర నగర్.

పీఎంకే నేతలకు అస్వస్థత



అరుళ్, జీకే మణి

చెన్నై, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పాట్టాలిమక్కల్ కట్చి (పీఎంకే) గౌరవాధ్యక్షుడు జీకే మణి, ఆ పార్టీ సేలం వెస్ట్ నియోజకవర్గం పీఎంకే శాసనసభ్యుడు అరుళ్ తీవ్ర అస్వస్థతకు గురై ఓమందూరార్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బుధవారం ఉదయం సచివాలయంలో స్పీకర్ అప్పావును కలిసేందుకు వెళ్ళిన అరుళ్‌కు ఉన్నట్టుండి గుండె నొప్పి వచ్చింది. వెంటనే ఆయన సహాయకులు సచివాలయంలోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అందించిన తర్వాత మెరుగైన చికిత్స కోసం ఓమందూరార్ ప్రభుత్వ ఆస్పత్రి కి పంపారు. ఇదే విధంగా జీకే మణి కూడా బుధవారం ఉదయం ఉన్నట్టుండి తీవ్ర అస్వస్థతకు గురై ఓమందూరార్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సేలంలో గురువారం పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి నాయకత్వంలో నిర్వహించనున్న పార్టీ బహిరంగ సభ ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్న సమయంలో వీరిద్దరు అస్వస్థతకు గురవడం పట్ల ఆ పార్టీ శ్రేణులు ఆందోళన చెందుతున్నారు.

తిరువణ్ణామలైలో పీఎంకే నేత దారుణహత్య



కామరాజ్ (ఫైల్‌ఫొటో)

టి.నగర్ జూన్ 18 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలైలో పీఎంకే నాయకుడు కామరాజ్‌ను దారుణంగా హత్యచేసిన వారిని పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం ఉదయం కామరాజ్, స్నేహితుడు రాజాతో కలిసి నాయుడు మంగళం రైల్వే గేట్ వద్ద వాకింగ్‌కు వెళుతుండగా గుర్తు తెలియని వ్యక్తులు చుట్టుముట్టి మారణాయుధాలతో దాడిచేసి పారిపోయారు. ఈ సంఘటనలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. ఈ సమాచారం తెలుసుకున్న కలసపాక్కం పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని గాయపడిన వారిని చికిత్స నిమిత్తం తిరువణ్ణామలై ప్రభుత్వాసుపత్రికి పంపారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం కామరాజ్‌ను వేలూరు అడుక్కంపారై ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఈ సంఘటనపై కామరాజ్ సోదరుడు జయప్రకాష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మణికంఠన్, కరుణానిధి అనే వారిని అరెస్టు చేశారు. పాత కక్షల నేపథ్యంలో ఈ హత్య జరిగి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు.

గర్భం దాల్చిన బాలిక

● నిందితుడి కోసం గాలింపు

పెరంబూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): విరుదునగర్ జిల్లా శివగామి ప్రాంతానికి చెందిన ఓ మహిళ ఇంటికి ఆమె అక్క కుమార్తె 14 ఏళ్ల బాలిక వచ్చింది. కొద్దివారాలు ఆ ఇంట్లో ఉన్న బాలిక ఇటీవల స్వగ్రామానికి వెళ్లింది. బాలిక అనారోగ్యానికి గురికావడంతో తల్లిదండ్రులు ఆమెను ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. బాలికను పరీక్షించిన వైద్యులు, ఆమె మూడు నెలల గర్భంతో ఉన్నట్లు తెలుసుకుని దిగ్భ్రాంతి చెందారు. ఈ విషయమై బాలికను విచారించగా, తన పెద్దమ్మ మూడో భర్త ఇంట్లో ఎవరూ లేని సమయంలో తనపై అత్యాచారానికి పాల్పడినట్లు తెలిపింది. ఈ విషయమై బాధిత బాలిక తల్లి శివకాశి మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసి పోలీసులు, పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలిస్తున్నారు.

వాటర్ ట్యాంకర్ ఢీకొని బాలిక మృతి

పెరంబూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెరంబూర్ సమీపంలో బుధవారం ఉదయం వాటర్ ట్యాంకర్ ఢీకొని పదేళ్ల బాలిక మృతిచెందింది. వివారలిలా... సౌమ్య (10) అనే బాలిక తల్లి యామినితో కలసి ద్విచక్రవాహనంలో పాఠశాలకు బయల్దేరింది. పెరంబూర్ పేపర్ మిల్స్ రోడ్డు సమీపంలో ఎదురుగా వచ్చిన వాహనం తప్పించబోయేలా సడన్ బ్రేక్ వేయడంతో, సౌమ్య వాహనం నుంచి కిందపడింది. అదే సమయంలో వెనుకగా వచ్చిన వాటర్ ట్యాంకర్ లారీ ఆమెపై ఎక్కడంతో ఘటనా స్థలంలోనే మృతిచెందింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

ఐదు రైల్వేస్టేషన్లలో అదనపు పోలీసు భద్రత

పెరంబూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కళాశాల విద్యార్థుల ఆగడాలను అరికట్టేందుకు చెన్నై సెంట్రల్ సహా ఐదు ప్రధాన రైల్వే స్టేషన్లలో అదనపు పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు. రాష్ట్రంలో ఆర్ట్స్, సైన్స్ కళాశాలలు ప్రారంభమైన నేపథ్యంలో, శివారు ప్రాంతాల నుంచి విద్యార్థులు అధికంగా సబర్బన్ రైళ్లలో వస్తుంటారు. వీరు రైళ్ల ఫుట్ బోర్డులు, కిటికీలపై ప్రయాణిస్తున్నారు. అదే సమయంలో, 'రూట్ తల' అనే పేరుతో నగరంలోని పలు కళాశాలల విద్యారులు పరస్పర దాడులకు పాల్పడుతున్నారు. ప్రధాన రైల్వేస్టేషన్లలో రైలు ఆగిన వెంటనే కత్తులు, మారణాయుధాలతో కళాశాల విద్యార్థులు దాడులకు పాల్పడడంతో ప్రయాణికులు బెంబేలెత్తుతున్నారు. ఈ నేపథ్యంలో, విద్యార్థుల ఆగడాలు అడ్డుకొనేలా చెన్నై సెంట్రల్, పెరంబూర్, వ్యాసర్పాడి, హిందూ కళాశాల, పట్టరవాక్కం తదితర రైల్వే స్టేషన్లలో ప్రస్తుతమున్న సిబ్బందితో పాటు మరో నలుగురు పోలీసులుంటారని రైల్వే పోలీసు శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

వృద్ధాశ్రమంలో ఐదుకు పెరిగిన మృతుల సంఖ్య

ప్యారీస్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): తెన్‌కాశిలోని ఓ వృద్ధాశ్రమంలో ఆహారం వికటించడం వల్ల మరణించిన వారి సంఖ్య ఐదుకు పెరిగింది. తెన్‌కాశి సుందరపాండ్యన్‌పురంలోవున్న ఓ వృద్ధాశ్రమంలో 60 మందికి పైగా ఆశ్రయం పొందుతున్నారు. ఈ నెల 11వ తేదీ బుధవారం రాత్రి ఆహారం తీసుకున్న తర్వాత 11 మంది అజీర్తికి గురికాగా, వారిని వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే ఆస్పత్రిలో చికిత్స ఫలించక సెంగోట్టుకు చెందిన శంకర్ గణేష్, అంబిగలు, చొక్కంపట్టికి చెందిన మురుగమ్మాళ్ మరణించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో, చికిత్స పొందుతూ ధనలక్ష్మి అనే వృద్ధురాలు 13వ తేదీ శుక్రవారం మృతిచెందింది. దీనిపై తెన్‌కాశి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు ఎస్పీ అరవింద్, తహసీల్దార్ లావణ్య, ఆరోగ్యశాఖ అధికారి గోవిందన్, జిల్లా ఆహార భద్రతా విభాగం అధికారి పుష్పరాజు తదితర అధికారుల బృందం శుక్రవారం ఆ వృద్ధాశ్రమాన్ని సందర్శించారు. ఆశ్రమానికి సీలు వేసి అందులోవున్న 48మందికి వైద్యపరీక్షలు నిర్వహించి సమీపంలోవున్న ప్రభుత్వ సంరక్షణ కేంద్రానికి తరలించారు. ఈ నేపథ్యంలో, తిరునల్వేలి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స ఫలించక ఇడైక్కాల్ గ్రామానికి చెందిన ముప్పుడాది (50) మంగళవారం రాత్రి మృతిచెందారు. దీనితో మృతుల సంఖ్య ఐదుకు పెరిగింది.

లారీని ఢీకొన్న ప్రభుత్వ బస్సు



ఐసిఎఫ్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): అరియలూరు పళుతాంగి ప్రాంతంలో ఆగిఉన్న లారీని ప్రభుత్వ బస్సు ఢీకొన్న ఘటనలో 12 మందికి గాయాలయ్యాయి. కారైక్కాల్ నుంచి సిమెంటు లోడుతో అరియలూరు వైపు వస్తున్న లారీ మంగళవారం రాత్రి 10.30 గంటల ప్రాంతంలో అరియలూరు తాత్కాలిక బస్టాండ్ సమీపంలోని ఫ్లై ఓవర్‌పై వస్తుండగా హఠాత్తుగా మరమ్మతులకు గురైంది. ఆ సమయంలో ఆ ప్రాంతమంతా చీకటిగా ఉండడం, లారీ నిలిచి ఉన్నట్టు ఎలాంటి సంకేతకం ఏర్పాటుచేయలేదని సమాచారం. ఆ సమయంలో, తంజావూరు నుంచి సేలం వైపు వెళ్తున్న ప్రభుత్వ బస్సు హఠాత్తుగా ఆగిన లారీ ని ఢీకొంది. ఈ ఘటనలో డ్రైవర్ పళనిస్వామి, కండక్టర్ ఉత్తరాపతి, 11 ఏళ్ల బాలుడు సహా 12 మందికి గాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు వారిని అరియలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై అరియలూరు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

తెన్‌కాశిలో మారణాయుధాల స్వాధీనం

● నలుగురి అరెస్ట్

ప్యారీస్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పర్యాటక ప్రాంతమైన తెన్‌కాశిలో బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన పోలీసులు అనుమానాస్పదంగా సంచరించిన నలుగురిని అదుపులోకి తీసుకుని 26 మారణాయుధాలను స్వాధీనం చేసుకున్నారు. తెన్‌కాశిలో అధిక జలపాతాలున్న కుట్రాళంలో మారణాయుధాలతో కొంతమంది వ్యక్తులు స్థానిక వ్యాపారులను బెదిరించి దోచుకుంటున్నారని, ప్రత్యేక విభాగ కార్యాలయానికి సమాచారం తెలిసింది. దీనితో రంగంలోకి దిగిన పోలీసులు బాలమురుగన్ (19) దినేష్ (20) మహ్మద్ (19), అరుణాచలం (22) అనే నలుగురిని కుట్రాలం వావానగర్‌లో అరెస్టు చేశారు. విచారణ అనంతరం వారిని కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలించారు.



'కైమేరా'లో ఎల్ఎన్టీ యతీష్, సౌమ్య

ఇన్వెస్టిగేషన్ థ్రిల్లర్‌గా 'కైమేరా'

సైన్స్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ థ్రిల్లర్ మూవీగా 'కైమేరా' పేరుతో ఓ చిత్రం రూపొందింది. దీన్ని పాన్ ఇండియా మూవీగా రిలీజ్ చేయనున్నారు. 'సెల్ఫిష్' వంటి పలు చిత్రాలకు దర్శకత్వం వహించిన మాణిక్ జై ఎన్. డైరెక్షన్‌లో ఈ సినిమా రూపుదిద్దుకుంది. ఈ చిత్రానికి దర్శకత్వం వహించడంతో పాటు సొంతంగా నిర్మించారు. ఎల్ఎన్టీ యతీష్ హీరోగా నటించగా, వైవిధ్యభరితమైన పాత్రలో తార్రై కృష్ణన్, రంజిత్ కుమార్, మాణిక్ జై నటించారు. హీరోయిన్లుగా సౌమ్య, కృష్ణ నందు, జ్ఞానేశ్వరి నటించారు. మానవ శరీరంలోకి జంతు కణాలను ఇంజెక్ట్ చేయడం వల్ల మనిషి ఎలా మారుతాడనే కాన్సెప్టుతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఈ కథ బెంగళూరు చుట్టూ సాగుతున్నందున షూటింగ్ కూడా బెంగళూరు, హంపి తదితర ప్రాంతాల్లో చిత్రీకరించారు. ఈ చిత్రం గురించి దర్శకుడు మాణిక్ జై మాట్లాడుతూ, 'ఇది ఒక శాస్త్రీయ క్రైమ్ థ్రిల్లర్ మూవీ. ఇప్పటివరకు ఎవరూ చెప్పని కోణంలో రూపొందిస్తున్నాం. సినిమాలో కామెడీ కూడా ఉంది. అందువల్ల ఫ్యామిలీ ఆడియన్స్‌కు నచ్చేలా రూపొందించాం. ఈ మూవీ ఏ భాషలో విడుదల చేసినా ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అవుతుంది. అందుకే పాన్ ఇండియా స్థాయిలో తమిళం, తెలుగు, మలయాళం, కన్నడం, హిందీ భాషల్లో రిలీజ్ చేయనున్నాం' అని తెలిపారు.

ఈ చిత్ర విజయం మా నాన్నకు అంకితం : కాళి వెంకట్

చిత్రజ్యోతి

'మద్రాస్ మ్యాట్నీ' చిత్రం విజయం తన తండ్రికి అంకితమిస్తున్నట్టు నటుడు కాళి వెంకట్ అన్నారు. సీనియర్ నటుడు సత్యరాజ్, కాళి వెంకట్, షెల్లీ, రోషిణి హరిప్రియన్, విశ్వ జార్జ్, మరియన్, అర్చన సందూక్, తదితరులు నటించిన 'మద్రాస్ మ్యాట్నీ' సినిమా ఈ నెల 6వ తేదీ విడుదలకాగా, ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. మద్రాస్ మోషన్ పిక్చర్స్ పతాకంపై నిర్మాత, దర్శకుడు కార్తికేయన్ మణి నిర్మించారు. ఈ సినిమా ఘన విజయం సాధించడంతో పాటు భారీ వసూళ్ళను రాబట్టింది. దీనిని పురస్కరించుకుని చిత్ర బృందం నగరంలో సక్సెస్ మీట్ నిర్వహించింది. ఇందులో నటుడు లొల్లు సభ స్వామినాథన్, సంగీత దర్శకుడు కేసీ బాల సారంగన్, నటుడు విశ్వ, నటి రోషిణి, హరిప్రియన్, డ్రీమ్ వారియర్ పిక్చర్స్ సంస్థకు చెందిన గుహన్ తదితరులు పాల్గొన్నారు. దర్శకుడు మాట్లాడుతూ, ' తొలిసారి తాను దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి విజయాన్ని చేకూర్చిపెట్టిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. హీరో కాళి వెంకట్ మాట్లాడుతూ, 'ఈ సినిమాను ఇంతటి ఘన విజయం చేకూర్చిపెట్టిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. ఈ సినిమా స్టోరీని దర్శక నిర్మాత వివరించినపుడు నా తండ్రి గుర్తుకు వచ్చారు. అందుకే ఈ చిత్ర విజయాన్ని ఆయనకు అంకితమిస్తున్నాను' అని పేర్కొన్నారు.



సక్సెస్ మీట్‌లో 'మద్రాస్ మ్యాట్నీ' చిత్ర బృందం

ప్రియమణి ప్రధాన పాత్రలో 'గుడ్ వైఫ్'



సీనియర్ నటి ప్రియమణి ప్రధాన పాత్రలో తెరకెక్కిన వెబ్ సిరీస్ 'గుడ్ వైఫ్'. జియో హాట్‌స్టార్ స్పెషల్‌గా ఈ సిరీస్ టీజర్‌ను తాజాగా రిలీజ్ చేసింది. ప్రియమణితో కలిసి సంపత్ రాజ్ మరో ప్రధాన పాత్ర పోషించారు. ఈ చిత్రానికి ప్రముఖ సీనియర్ నటి రేవతి దర్శకత్వం వహించారు. ఈ సిరీస్‌పై దర్శకురాలు రేవతి మాట్లాడుతూ, 'హిందీ రీమేక్‌లో 'గుడ్ వైఫ్' విజయం తర్వాత తమిళంలో ఈ సిరీస్‌కు దర్శకత్వం వహించే అవకాశం లభించినందుకు సంతోషంగా ఉంది. ఇందులో హీరోయిన్ పాత్ర చాలా బలంగా ఉంది. ఆమె వ్యక్తిగత, వృత్తిపరంగా అనేక సవాళ్ళను ఎదుర్కొంటుంది. దీన్ని స్క్రిప్ట్ చేసి, ఆసక్తికరమైన స్క్రీన్‌ప్లేతో చిత్రీకరించడం సంతోషంగా ఉంది. ప్రియమణి, సంపత్ రాజ్ వంటి ప్రతిభావంతులైన నటీనటులతో కలిసి పనిచేయడం ఆనందంగా ఉంది' అని అన్నారు.

మాట తప్పని శివకార్తికేయన్

● దర్శకుడు ఐ.శరవణన్

దివంగత నెల్ జయరామన్ కుమారుడు విద్యాభ్యాసానికి అయ్యే ఖర్చును గత ఏడేళ్ళుగా హీరో శివకార్తికేయన్ భరిస్తూ ఇచ్చిన మాట తప్పకుండా కాపాడుకుంటూ వస్తున్నారని దర్శకుడు ఐ.శరవణన్ అన్నారు. ఇదే విషయంపై శరవణన్ మాట్లాడుతూ, 'నా సోదరుడు నెల్ జయరామన్ మరణించినపుడు ఇచ్చిన మాట ప్రకారం తన సోదరుడి కుమారుడు శ్రీనివాసన్ విద్యా ఖర్చులను భరిస్తానని శివకార్తికేయన్ మాట ఇచ్చారు. ఆ మాట ప్రకారం గత ఏడేళ్ళుగా విద్యా ఖర్చులను భరిస్తున్నారు. సాధారణంగా కష్టకాలంలో ఉన్న సమయంలో మాట ఇచ్చే కొందరు ఆ తర్వాత దాన్ని విస్మరిస్తుంటారు. కానీ, శివకార్తికేయన్ మాత్రం గత ఏడేళ్ళుగా మొత్తం ఖర్చులను భరించడమే కాకుండా ప్రతి యేటా పబ్లిక్ పరీక్షల సమయంలో ఫోన్ చేసి అన్ని విషయాలు అడిగి తెలుసుకుంటున్నారు. శ్రీనివాసన్ ఇపుడు కోయంబత్తూరులోని కర్పగం కాలేజీలో చేర్చారు. ఇలా ఇచ్చిన మాటను కాపాడుకోవడం చాలా అరుదని, అలాంటి అరుదైన వ్యక్తుల్లో శివకార్తికేయన్ ఒకరని దర్శకుడు శరవణన్ అన్నారు.



శివకార్తికేయన్ - నెల్ జయరామన్ (ఫైల్‌ఫొటో)

విజేతగా ఉండటానికే ఇష్టపడతాను

● హీరో అజిత్ కుమార్

అడయార్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఎల్లవేళలా తాను విజేతగా ఉండేందుకే ఇష్టపడతానని హీరో అజిత్ కుమార్ స్పష్టం చేశారు. ఆయన తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, 'సినిమాల్లో అడుగుపెట్టినపుడు నా మాటల్లో అంగ్లం కలిసిఉండేదని, తమిళం సరిగ్గా ఉచ్ఛరించడం లేదనే విమర్శలు వినిపించాయి. దీంతో తమిళంలో శిక్షణ తీసుకున్నాను. ఇపుడు నా స్థానం ఏంటో మీకు తెలుసు. సినిమాల్లో తరహాలోనే కార్ రేస్ పోటీల్లో కూడా గాయాలవుతాయి. ఇతరులు చేసే విమర్శలను పట్టించుకోను. ఎట్టిపరిస్థితుల్లోనూ నన్ను నేను అంచనా వేసుకోను. ఎల్లవేళలా విజేతగా ఉండటానికే ఇష్టపడతాను. నా చివరి రోజుల్లో కూడా నాకు నచ్చిన పని చేస్తూ, ఏదో చేస్తున్నాననే సంతృప్తి పొందుతాను' అని అజిత్ కుమార్ పేర్కొన్నారు.



మద్రాస్ సంస్కృత కళాశాలలో నాలుగు కొత్త సంస్థలు

● ప్రారంభించిన కంచి పీఠాధిపతి



ప్రారంభోత్సవంలో కంచి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి

అడయార్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మద్రాస్ సంస్కృత కళాశాలలో నాలుగు కొత్త సంస్థలు ఏర్పాటయ్యాయి. 'రామరత్నం భారతీయ విద్యాలయం', ' చంద్రశేఖరేంద్ర సరస్వతి వేదపాఠశాల', 'కృష్ణస్వామి అయ్యర్ శాస్త్ర వారిధి', 'శైవ ఆగమ విభాగాలను కంచి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి బుధవారం ప్రారంభించారు. ఈ రోజు ప్రారంభమైన వేదపాఠశాల, భారతీయ విద్యాలయం ఈ భారతీయ సెంటర్ ఫర్ ఎక్స్‌లెన్స్‌లో భాగమని నిర్వాహకులు తెలిపారు.


22న శ్రీనివాస తిరుకల్యాణోత్సవం



సుదర్శన హోమంలో అర్చకులు, నిర్వాహకులు

ప్యారీస్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వేంకటాద్రి భజన సమాజం (ఎస్‌వీబీఎస్) ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేది ఆదివారం శ్రీనివాస తిరుకల్యాణోత్సవం జరుగనుంది. మాధవరం బస్ టెర్మినల్ సమీపంలోని రెట్టేరి ఆర్టీవో కార్యాలయం జవహర్‌లాల్ నెహ్రూ రోడ్డులో ఉన్న ఉమియ మహల్‌లో 21,22 తేదీల్లో లోకకల్యాణార్థం నిర్వహించనున్న వేడుకలు నిర్విఘ్నంగా సాగాలని కోరుతూ బుధవారం ఉదయం పొన్నియమ్మన్ మేడు మోహన్‌నగర్‌లోని వెంకటాద్రి భజన సమాజం కార్యాలయ ప్రాంగణంలో స్తంభస్థాపన పూజల అనంతరం తిరుకోష్టియూర్ హరిప్రసాద్ శిష్యబృందం చక్రత్తాళ్వార్‌కు సుదర్శన హోమాన్ని నిర్వహించారు. బుధవారం నుండి ఆదివారం వరకు ఐదు రోజులపాటు నిర్వహించనున్న ఈ వేడకల గురించి నిర్వాహకులు కె.పద్మరాజ్, కె.ఐశ్వర్య మాట్లాడుతూ, శ్రీమాన్ భక్త పార్థసారథి రామానుజర్ ఆశీస్సులతో లోక సంక్షేమార్థం శ్రీనివాస కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో బుధవారం నుండి శుక్రవారం వరకు నాట్యాంజలి, ఉపన్యాసం, వీణానాదం, భజన, దీపపూజ, కుంకుమార్చన జరుగుతుందని తెలిపారు. 21వ తేది సాయంత్రం 7 గంటలకు జనవాసం, గరుడ వాహన సేవ, జన్మరక్షక హరినామ సంకీర్తనం, 22వ తేది ఉదయం 7.45 నుండి మధ్యాహ్నం 3 గంటల్లోపు ఉమియ మహల్‌లో త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి, త్రిదండి అహోబిలం రామానుజ జీయర్ స్వామి, శ్రీవిల్లిపుత్తూరు త్రిదండి శఠగోప రామానుజ జీయర్ స్వామి, తిరుకోష్టియూర్ మాధవన్‌స్వాముల పర్యవేక్షణలో తిరుమంజనం, అభిషేకం, కాశియాత్ర, మహా సంకల్పం, మాంగల్యధారణ జరుగుతుందని తెలిపారు. భక్తులందరూ పాల్గొని దైవాశీస్సులు పొందాలని వారు పిలుపునిచ్చారు.

వాహనచోదకులకు 'జామ పండు'



జామ పండు అందజేస్తున్న డిప్యూటీ ట్రాఫిక్ కమిషనర్ సురేష్

పెరంబూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): హెల్మెట్ ధరించిన ద్విచక్ర వాహనచోదకులను ట్రాఫిక్ పోలీసులు అభినందించారు. రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాపాయం నుంచి బయటపడేలా హెల్మెట్ ధరించాలని, అతి వేగంగా, మద్యం సేవించి వాహనాలు నడపడం మానుకోవాలి తదితర ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షిత ప్రయాణం చేయాలని ట్రాఫిక్ పోలీసులు వాహన చోదకులకు అవగాహన కల్పించాలి. ఈ క్రమంలో, కన్నియాకుమారి జిల్లా తక్కలై రోడ్డులో బుధవారం ఉదయం ట్రాఫిక్‌కు క్రమబద్ధీకరణలో ఉన్న ట్రాఫిక్ పోలీసులు, హెల్మెట్ ధరించి వచ్చిన ద్విచక్ర వాహనచోదకులను అభినందించి వారికి జామ పండు బహుమతిగా అందించారు.

భారీగా జలపుష్పాలు

● ఊపందుకున్న చేపల అమ్మకాలు

● రామేశ్వరం ఫిషింగ్ హార్బర్‌లో సందడి

పోటీపడిన కొనుగోలుదారులు



కొనుగోలుదారుల రద్దీ





అమ్మకాలకు ఉంచిన పలు రకాలు చేపలు - పెద్దసైజు చేపలు

ప్యారీస్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చేపల వేటపై నిషేధ కాలం ఇటీవల పూర్తయిన నేపథ్యంలో, 61 రోజుల అనంతరం మళ్ళీ చేపల అమ్మకాలు ఊపందుకున్నాయి. సముద్రంలో చేపల సంతానోత్పత్తికి అంతరాయం కలుగకుండా ప్రతిఏటా ఏప్రిల్ 15 నుండి జూన్ 14వ తేదీ వరకు చేపల వేటపై నిషేధం విధిస్తారు. ఈ ఏడాది విధించిన నిషేధం గత శనివారం అర్ధరాత్రితో ముగియడంతో, గంగపుత్రులు ఉత్సాహంగా మర పడవలతో చేపలవేటకు వెళ్ళి నాలుగు రోజుల అనంతరం తమకు లభ్యమైన సముద్ర సంపదతో తీరానికి తిరిగిరావడం మొదలుపెట్టారు. ఈ క్రమంలో రామనాథపురం జిల్లా రామేశ్వరం ఫిషింగ్ హార్బర్‌లో చేపల అమ్మకాలు జోరుగా సాగాయి. రకరకాల చేపలను కొనుగోలు చేసేందుకు మధ్యవర్తులు, వ్యాపారులు పోటీపడ్డారు. రెండు వారాల వరకు అధిక ధర పలికిన చేపల ధరలు కాస్త తగ్గడంతో వ్యాపారులు, మాంసాహార ప్రియులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

వడకలై, తెన్‌కలై ... ఒకే కొమ్మకు చెందిన రెండాకులు

● విభేదాలు విడిచి ఐకమత్యంతో వ్యవహరించండి ● హైకోర్టు హితవు

టి.నగర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): తమ ఆచార్యులే (గురువులే) అందరికంటే గొప్ప అనే రీతిలో వడకలై, తెన్‌కలై వర్గాలకు చెందిన వైష్ణవులు ఘర్షణలకు దిగడం తగదని, ఈ రెండు వర్గాలు ఒకే కొమ్మకు చెందిన రెండాకుల వంటివని, విబేధాలు విస్మరించి ఐకమత్యంగా భగవదారాధన చేయాలని మద్రాసు హైకోర్టు హితవు పలికింది. తెన్‌కలై వర్గానికి చెందిన డీఏపీ శ్రీరంగాచారి, కేవీ శ్రీనివాసన్ దాఖలు చేసిన పిటిషన్ తోసిపుచ్చింది. కాంచీపురంలోని 'విలక్కొళి పెరుమాళ్ అనే దీప ప్రకాశ ఆలయం వెలుపల తెన్‌కలై వర్గానికి చెందిన శైవ పండితులు 'తెన్‌కలై వాళి తిరునామం', దివ్యప్రబంధాన్ని గానం చేయకూడదంటూ ఆలయ కార్యనిర్వహణాధికారి ఉత్తర్వు జారీచేశారని, ఆ ఉత్తర్వును రద్దు చేయాలని ఆ పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్ న్యాయమూర్తి ఆనంద్ వెంకటేష్ ఎదుట విచారణకు వచ్చింది. పిటిషనర్ తరఫు న్యాయవాది తన వాదనలను వినిపిస్తూ దీప ప్రకాశ ఆలయంలో తెన్‌కలై వర్గానికి చెందిన వైష్ణవ పండితులు మంత్రాలు పఠించడానికి అనుమతిస్తూ 1915లో కాంచీపురం జిల్లా మునసబు కోర్టు తీర్పు ఇచ్చిందని, 1918లో ఆ తీర్పును హైకోర్టు కూడా సమర్థించిందన్నారు. ఈ వాదనను తిరస్కరిస్తూ వడకలై వర్గం తరఫు న్యాయవాది తన వాదనలను వినిపించారు. ఇరుతరఫు వాద ప్రతివాదనల అనంతరం న్యాయమూర్తి ఆనంద్ వెంకటేష్ మాట్లాడుతూ దీప ప్రకాశ ఆలయంలో ప్రతి పండుగ సమయంలోనూ తమ ఆచార్యదేవుళ్లే అందరికంటే గొప్పవారనే భావంతో తెన్‌కలై, వడకలై వర్గాల వారు గొడవలకు దిగుతున్నారని, వాటిని నివారించి ఆలయంలో ప్రశాంత వాతావరణం కొనసాగేందుకు ఆలయ కార్యనిర్వహణాధికారి తెన్‌కలై వైష్ణవ పండితులు దివ్యప్రబంధాన్ని పఠించడంపై నిషేధం విధించినట్లు స్పష్టమవుతోందన్నారు. ఈ ఇరువర్గాలవారు భగవంతుడైన శ్రీవెంకటేశ్వరస్వామివారి కంటే తమ ఆచార్య దేవుళ్లే గొప్ప అనే భావన వల్లే ఘర్షణకు దిగుతున్నారన్నారు. ఏ మతమైనా ప్రేమను మాత్రమే పంచుతుందని, ద్వేషభావాలను రెచ్చగొట్టదని, ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని వడకలై వర్గం వైష్ణవ పండితులతో కలిసి తెన్‌కలై వర్గం పండితులు కలిసికట్టుగా దివ్యప్రబంధాన్ని పఠించడమే ఉత్తమం అని న్యాయమూర్తి పేర్కొన్నారు. ఇరువర్గాల వైష్ణవ పండితులు మత విశ్వాసమనే మార్గంలో ఐకమత్యంగా పయనించాలని హితవు చెబుతూ పిటిషన్‌ను తోసిపుచ్చారు.

మురుగన్ మహానాడు జరిపినా బీజేపీ బలం పెరిగే అవకాశం లేదు

● డీఎంకే ఎంపీ కనిమొళి



కన్నియాకుమారిలో మీడియాతో మాట్లాడుతున్న ఎంపీ కనిమొళి

చెన్నై, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మదురైలో మురుగన్ మహానాడు నిర్వహించడం వల్ల రాష్ట్రంలో బీజేపీ పరపతి పెరిగే అవకాశమే లేదని డీఎంకే ఎంపీ కనిమొళి ఎద్దేవా చేశారు. కన్నియాకుమారిలో బుధవారం ఉదయం ఆమె మీడియాతో మాట్లాడుతూ డీఎంకే కూటమి మరింత పటిష్టంగానే ఉందని మిత్రపక్షాల్లో కొన్ని పార్టీలు కూటమి నుండి వైదొలగుతాయని బీజేపీ, అన్నాడీఎంకే నేతలు చేస్తున్న ప్రకటనలు అవాస్తవాలన్నారు. డీపీఐ నేత తిరుమావళవన్ డీఎంకే నేత, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌తో సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్నారని, కూటమిలో కీలకపాత్ర పోషిస్తున్నారని, వాస్తవాలిలా ఉండగా డీపీఐ కూటమికి గండి కొట్టడం ఖాయమని ప్రతిపక్షాలు పనిగట్టుకుని దుష్ప్రచారం చేయడం తగదన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ తామిప్పుడు మురుగన్‌ను చేతులకెత్తుకున్నామని, త్వరలో రాష్ట్రంలో అధికారాన్ని కూడా హస్తగతం చేసుకుంటామని ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. మురుగన్ మహానాడు నిర్వహించడం వల్ల రాష్ట్రంలో బీజేపీ బలం ఏ మాత్రం పెరిగే అవకాశమే లేదని కనిమొళి చెప్పారు. బుధవారం ఉదయం కన్నియాకుమారికి వెళ్ళిన కనిమొళికి మంత్రి మనో తంగరాజ్, మాజీ మంత్రి సురేష్‌రాజన్, డీఎంకే స్థానిక శాఖ నాయకులు బాబు, తామరై భారతి, మాజీ ఎంపీ హెలెన్ డేవిడ్‌సన్, కన్నియాకుమారి పురపాలక సంఘం అధ్యక్షులు కుమరి స్టీఫన్ తదితరులు ఘనంగా స్వాగతం పలికారు.

విష్ణుపురం శరవణన్‌కు 2025 బాలసాహిత్య పురస్కారం



విష్ణుపురం శరవణన్

ఐసిఎఫ్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): విష్ణుపురం శరవణన్‌కు 2025 సంవత్సరానికి తమిళంలో బాలసాహిత్య పురస్కారం ప్రకటించారు. బాల సాహిత్యానికి కృషి చేసిన వారికి సాహిత్య అకాడమీ ఈ పురస్కారం అందజేస్తోంది. దేశంలోని 24 గుర్తింపు పొందిన భాషల్లో ప్రచురితమైన ఉత్తమ బాలసాహిత్య రచనలకు ఈ అవార్డు ఇస్తుంటారు. ఆ ప్రకారం, 35 సంవత్సరాల కంటే తక్కువ వయస్సున్న యువ రచయితలకు సాహిత్య అకాడమీ యువ పురస్కార్ అవార్డులను బుధవారం ప్రకటించింది.ఈ క్రమంలో, విష్ణుపురం శరవణన్ రాసిన 'ఒట్రైచ్ సిరగు ఓవియా' నవలకు బాలసాహిత్య పురస్కార్ అవార్డు ప్రకటించారు. అవార్డుతో పాటు రూ.50వేల నగదు బహుమతి ప్రదానం చేయనున్నారు.తమిళంలో బాలల కథలు, నవలు రాస్తున్న విష్ణుపురం శరవణన్ 'కైరు', 'నీలపూ' వంటి పుస్తకాలు రచించారు. అదే విధంగా, మదురైకి చెందిన రచయిత లక్ష్మీహర్‌కు 'కూతు వోన కూడిట్టు' అనే కథా సంకలనానికి సాహిత్య అకాడమీ యువ పురస్కారం ప్రకటించారు.

తిరుత్తణి ఆలయంలో రూ.86.76 కోట్లతో ధర్మశాల



శంకుస్థాపన చేస్తున్న ఎంపీ జగద్రక్షగన్, ఎమ్మెల్యే ఎస్.చంద్రన్, కలెక్టర్ ప్రతాప్ తదితరులు

తిరుత్తణి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణిలో ప్రసిద్ధి చెందిన మురుగన్ ఆలయ ప్రాంగణంలో తొమ్మిదంతస్తుల ధర్మశాల నిర్మాణానికి ఎంపీ జగద్రక్షగన్ బుధవారం ఉదయం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం ప్రతిష్ఠాత్మకమైన పథకాలను ప్రవేశపెడుతోందని, అదే విధంగా ఆలయాల సంరక్షణ కోసం పాటుపడుతోందన్నారు. అందులో భాగంగానే తిరుత్తణి మురుగన్ దర్శనానికి వచ్చే భక్తులు వేచివుండేందుకు వెయిటింగ్‌హాలు నిర్మాణాలతో పాటు ధర్మశాల నిర్మాణానికి రూ.86.76 కోట్లు ఖర్చుచేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆలయ నిర్వాహకుల సమక్షంలో శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలోని భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తిరుత్తణి ఎమ్మెల్యే ఎస్.చంద్రన్, కలెక్టర్ ప్రతాప్, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

దేవాదాయ శాఖలో రూ.217.98 కోట్లతో కొత్త ప్రాజెక్టులు

● శంకుస్థాపన చేసిన సీఎం స్టాలిన్



సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కొత్త పథకాలకు శంకుస్థాపన చేస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

చెన్నై, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): దేవాదాయ శాఖలో రూ. 217.98 కోట్లతో చేపట్టనున్న కొత్త పథకాలకు ముఖ్యమంత్రి స్టాలిన్ శంకుస్థాపన చేశారు. అదే విధంగా ఆ శాఖలో రూ.21.50 కోట్లతో నిర్మాణం పూర్తి చేసుకున్న పథకాలకు ప్రారంభోత్సవం చేశారు. గురువారం ఉదయం చెన్నై సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన కొత్త పథకాలకు శంకుస్థాపన, పూర్తయిన పథకాలకు ప్రారంభోత్సవం చేశారు. తిరుత్తణి ఆలయంలో రూ.86.76 కోట్లు, తిరుచ్చి జిల్లా కుమార వయలూరు సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో రూ.30.35 కోట్లు, పళని దండాయుధపాణి ఆలయంలో రూ.14.56 కోట్లు, తిరువళ్లూరు జిల్లా పెద్దపాళయం భవానీ అమ్మవారి ఆలయంలో రూ.12.03 కోట్లు, విల్లుపురం జిల్లా సింగవరం అరంగనాథస్వామి ఆలయంలో రూ.10 కోట్లు, రామేశ్వరం రామనాథస్వామివారి ఆలయంలో రూ.7కోట్లతో చేపట్టనున్న పథకాలకు ఆయన శంకుస్థాపన చేశారు. ఇదే విధంగా మరికొన్ని ఆలయాల్లో అమలు చేయనున్న నిర్మాణ పనులకు ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రి పీకే శేఖర్‌బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం, పర్యాటక, దేవాదాయ శాఖల అదనపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కే మణివాసన్, హిందూ దేవాదాయ శాఖ కమిషనర్ పీఎన్ శ్రీధర్, చీఫ్ ఇంజనీర్ పి.పెరియసామి తదితరులు పాల్గొన్నారు.



మాజీమంత్రి, దివంగత కక్కన్ జయంతి సందర్భంగా రాయపేట సత్యమూర్తి భవన్‌లో బుధవారం ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు సెల్వ పెరుంతగై, కేవీ తంగబాలు తదితరులు

'రూట్ తల్' ఘర్షణలు అడ్డుకొనేలా 257 ప్రాంతాల్లో నిఘా

వాషర్‌మెన్‌పేట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): నగరంలో 'రూట్ తల్ ఘర్షణలు అడ్డుకొనేలా 257 ప్రాంతాల్లో నిఘా ఏర్పాటుచేసినట్లు నగర పోలీసు శాఖ తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుత విద్యా సంవత్సరం కళాశాలలు ప్రారంభమయ్యాయి. ఆయా మార్గాలకు తామే 'రూట్ తల్' అంటూ విద్యార్థులు ఆగడాలు సృష్టిస్తుంటారు. విద్యార్థుల ఆగడాలు అడ్డుకొనేలా ఉత్తర, దక్షిణ, మధ్య చెన్నై అని మొత్తం 257 ప్రాంతాల్లో నిఘా ఏర్పాటుచేసినట్లు, ఘర్షణలకు పాల్పడే విద్యార్థులపై కఠిన చర్యలు చేపడతామని నగర పోలీసు శాఖ హెచ్చరించింది.

శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్ 2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 6 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

- సోమవారం హుండీ ఆదాయం: రూ.4.12 కోట్లు
- మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 81,037
- తలనీలాలు సమర్పించినవారు: 30,548



ఢిల్లీలో ఇళ్లు కోల్పోయిన వారికి రాష్ట్ర ప్రభుత్వ సాయం

ఐసిఎఫ్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో ఇళ్ల కూల్చివేత కారణంగా ఇబ్బందులకు గురైన తమిళ కుటుంబాలకు మంత్రి నాజర్ ఆర్థిక సాయం అందజేశారు. దక్షిణ ఢిల్లీలోని కల్కాజీ ఎక్స్‌టెన్షన్‌లోని భూమిహీన్ శిబిరం (మదరాసు శిబిరం)లో నివసిస్తున్న వారు ఖాళీ చేయాలని ఢిల్లీ అభివృద్ధి అథారిటీ నోటీసులిచ్చింది. నిర్వాసితులు ఆ రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు చేపట్టిన తరుణంలో ఇళ్లు కూల్చివేశారు. మదరాసు శిబిరంలో ఇళ్లు కూల్చివేయబడిన 370 కుటుంబాలకు రూ.50 లక్షలు అందజేస్తామని ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. ఈ క్రమంలో, ఢిల్లీలోని తమిళనాడు భవన్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో మంత్రి నాజర్ ఒక్కో కుటుంబానికి తలా రూ.8 వేల నగదు, రూ.4 వేల విలువైన నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి ఏకేఎస్ విజయన్, ప్రవాస తమిళుల సంక్షేమ కమిషనర్, ఐఏఎస్ అధికారి వల్లలార్ తదితరులు పాల్గొన్నారు.

లంచం కేసులో రిటైర్డ్ ఇంజనీర్‌కు రెండేళ్ల జైలుశిక్ష

ఐసిఎఫ్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): లంచం తీసుకున్న కేసులో పదవీ విరమణ పొందిన విద్యుత్ బోర్డు ఇంజనీర్‌కు రెండేళ్ల జైలుశిక్ష విధిస్తూ కోర్టు తీర్పు వెలువరిచింది. 2005లో తువాక్కుడిలో ఓ సంస్థకు అదనపు విద్యుత్ లైన్ వేసేందుకు ఇంజనీర్ ఆర్ముగం రూ.5 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అరెస్ట్ చేసింది. ప్రస్తుతం ఆర్ముగం పదవీ విరమణ పొందిన నేపథ్యంలో, లంచం కేసులో ఆయనకు రెండేళ్ల జైలుశిక్ష, రూ.20 వేల జరిమానా విధిస్తూ జిల్లా అవినీతి నిరోధక కోర్టు బుధవారం తీర్పు వెలువరించింది.

అన్నాడీఎంకే మాజీ ఎమ్మెల్యేపై కేసు

అడయార్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): స్టాంప్ పత్రాలపై తేదీ మార్చిన వ్యవహారంలో అన్నాడీఎంకే నేత, మాజీ ఎమ్మెల్యే గాంధీ రాముపై నీలగిరి జిల్లా కోతగిరి పోలీసులు కేసు నమోదు చేశారు. కోతగిరి ప్రాంతానికి చెందిన దిలీప్ అనే వ్యక్తికి టీ ఫ్యాక్టరీ ఉంది. ఈ ఫ్యాక్టరీని నకిలీ స్టాంపు పత్రాలు సృష్టించి కొందరు ఆక్రమించుకున్నట్లు గుర్తించారు. ఈ విషయాన్ని సమాచార హక్కు చట్టం ద్వారా నిర్ధారించుకుని, ఊటీలోని రిజిస్ట్రార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. దీంతో రిజిస్ట్రార్ లోతుగా విచారించగా, అన్నాడీఎంకే మాజీ ఎమ్మెల్యే గాంధీ రాము, ఆయన సోదరుడు రాజన్, రాజ్‌కుమార్, రాజు, లింగమ్మాళ్, దురై వారసులైన దీపు, దిలీప్, రంజిత్ కలిసి రూ.50 వేల విలువైన స్టాంప్ పత్రాలను 2012, ఫిబ్రవరి 8, 22వ తేదీల్లో కొనుగోలుచేసి, ఆ పత్రాలపై ఉన్న తేదీలను 2006 మే 31వ తేదీన కొనుగోలు చేసినట్లుగా సృష్టించి, టీ ఫ్యాక్టరీని తమ పేరుమీద రిజిస్టర్ చేయించుకున్నట్లు గుర్తించారు. దీంతో మాజీ ఎమ్మెల్యే సహా మొత్తం ఎనిమిది మందిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

వడపళనిలో గర్భిణి ఆత్మహత్యాయత్నం

ఐసిఎఫ్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక వడపళనిలో నాలుగో అంతస్తు నుంచి దూకి గర్భిణి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన కలకలం రేపింది. వడపళని బాలాజీ అవెన్యూ ప్రాంతంలో ఉంటున్న అపార్ట్‌మెంట్‌లో బీహార్ రాష్ట్రానికి చెందిన సురేష్ నివసిస్తున్నాడు. సురేష్‌కు భార్య సరస్వతి (23), ఏడాదిన్నర కుమారుడున్నాడు. ప్రస్తుతం మళ్లీ సరస్వతి గర్భంతో ఉంది. మంగళవారం రాత్రి సురేష్ యధావిధిగా భార్య, కుమారుడితో కలసి నిద్రించాడు. ఈ నేపథ్యంలో, సరస్వతి ఇంటి నుంచి బయటకు వచ్చి నాలుగో అంతసు నుంచి కిందకు దూకింది. తీవ్రంగా గాయపడిన సరస్వతిని సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై వడపళని పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. కాగా, సరస్వతికి కొంతకాలంగా బుద్ధిమాంద్యం కారణంగా చికిత్సలు చేయిస్తున్నట్లు సమాచారం.

యువతిపై అత్యాచారం

- ఇద్దరి అరెస్టు

అడయార్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పెళ్ళి చేసుకుంటామని నమ్మించి ఒక యవతిని లాడ్జీకి తీసుకెళ్ళి అత్యాచారం చేసిన కేసులో రియల్ ఎస్టేట్ యజమాని, ఆయన కారు డ్రైవర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. కోయంబేడు పోలీసులకు నెల రోజుల క్రితం ఓ యువతి ఫోన్ చేసి.. 50 యేళ్ళ వ్యక్తి ఒకరు పెళ్ళి చేసుకుంటానని నమ్మించి, లాడ్జీకి తీసుకెళ్ళి అత్యాచారం చేశాడని చెప్పింది. దీంతో వారు స్టేషన్‌కు వచ్చి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయాలని సూచించడంతో ఆ యువతి కోయంబేడు ఆల్ ఉమెన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బెంగళూరుకు చెందిన తనకు సుందర్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడి, ఆ తర్వాత ఫోనులో మాట్లాడుకోవడం ప్రారంభించాం. కొద్ది రోజుల తర్వాత తనను పెళ్ళి చేసుకుంటానని అతను నమ్మించాడు. ఈ క్రమంలో ఓ రోజు ఫోన్ చేసి, అనారోగ్యంతో బాధపడుతున్నానని, వెంటనే చెన్నై రావాలని చెప్పడంతో హుటాహుటిన నగరానికి వచ్చాను. కోయంబేడు బస్టాండులో దిగగానే సుందర్ కారు డ్రైవర్ హరికృష్ణన్ వచ్చి వడపళనిలోని ఓ లాడ్జీకి తీసుకెళ్ళాడు. అక్కడ సుందర్ మాయమాటలు చెప్పి లైంగికదాడి చేశాడు. ఆ తర్వాత హరికృష్ణన్ కూడా అత్యాచారం చేశాడని ఫిర్యాదులో పేర్కొంది. దీంతో సుందర్, హరికృష్ణన్‌లను అరెస్టు చేశారు. కేసు దర్యాప్తు జరుపుతున్నారు.

20, 21 తేదీల డీఎస్సీ పరీక్షల మార్పు

చిత్తూరు సెంట్రల్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోన్న క్రమంలో ఈనెల 20, 21 తేదీల్లో జరగాల్సిన మెగా డీఎస్సీ పరీక్షల తేదీలను మార్పు చేసినట్లు డీఈవో వరలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రెండు రోజుల్లో పరీక్షలు రాయాల్సిన అభ్యర్థులకు జూలై 1, 2 తేదీల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు హాల్‌టికెట్లు ఈనెల 25వ తేదీ ఏపీడీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని తెలిపారు. యోగా దినోత్సవం ద్వారా పరీక్షలకు హాజరయ్యే వారు ఇబ్బందులు పడకూడదనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు డీఈవో ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

హ్యావెల్స్ పరిశ్రమలో రక్తదానం



రక్తదానంలో పాల్గొన్న హావెల్స్ ఉద్యోగులు


సత్యవేడు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీలోని ఏసీ తయారీ పరిశ్రమ హ్యావెల్స్ లాయిడ్‌లో ప్రపంచ రక్తదాత దినోత్సవం సందర్భంగా బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. నెల్లూరుకు చెందిన రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో పరిశ్రమలోని 128 మంది ఉద్యోగులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేసినట్లు ప్లాంట్ హెడ్ గిరీష్‌చంద్ర తెలిపారు. ఇందులో 44 మంది తొలిసారిగా రక్తదానం చేశారన్నారు. కార్యక్రమంలో పరిశ్రమ ప్రతినిధులు లారెన్స్ ఆరోగ్యరాజ్, అశ్విందర్ రైనా, ప్రవీణ్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు

హిందువుల ఐకమత్యం కోసమే

మురుగన్ భక్తుల మహానాడు

- డీఎంకే నేతలు వచ్చినా ఆహ్వానిస్తాం
- స్టాలిన్‌కు ఆహ్వానం పంపించాం
- హిందూ మున్నాని రాష్ట్ర అధ్యక్షుడు కాటేశ్వర సుబ్రహ్మణ్యం

చెన్నై, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 22న మదురైలో నిర్వహించనున్న మురుగన్ భక్తుల మహానాడు రాజకీయ లబ్ధికోసం కాదని హిందువుల్లో ఐకమత్యం పెంచేందుకే జరుపుతున్నామని హిందూ మున్నాని రాష్ట్ర అధ్యక్షుడు కాటేశ్వర సుబ్రహ్మణ్యం స్పష్టం చేశారు. కుంభకోణంలో బుధవారం మధ్యాహ్నం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ మురుగన్ భక్తుల మహానాడుకు వెళ్ళకూడదంటూ డీఎంకే ప్రభుత్వం, పోలీసులు ప్రజలను బెదరిస్తుండటం గర్హనీయమన్నారు. మహానాడు ప్రకటన చేసినప్పటి నుండి ఇప్పటి దాకా ప్రభుత్వం నుండి ఎన్నో అవరోధాలు వచ్చాయని, వాటినన్నింటినీ న్యాయపోరాటం ద్వారా అధిగమించి మురుగన్ భక్తుల మహానాడును నిర్వహించనున్నామని చెప్పారు.



స్టాలిన్‌కు లేఖ...

రాజకీయాలకు అతీతంగా జరుగనున్న ఈ మురుగన్ భక్తుల మహానాడుకు ముఖ్యమంత్రి స్టాలిన్ హాజరు కావాలని ఆయన కోరారు. మహానాడుకు రమ్మంటూ స్టాలిన్‌కు, హిందూ మున్నానిని వ్యతిరేకించే రాజకీయ పార్టీల నాయకులందరికీ కూడా ఆహ్వాన పత్రాలు, ప్రత్యేకంగా లేఖలు కూడా పంపినట్లు ఆయన వివరించారు. మహానాడుకు దేశవిదేశాల నుండి సుమారు 5లక్షల మంది వరకు హాజరుకానున్నారని చెప్పారు. సింగపూరు, మలేసియా, జపాన్ దేశాల నుండి కూడా మురుగన్ ఆలయాల నిర్వాహకులు, ప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో రానున్నట్టు తెలిపారు. ఈ మహానాడులో డీఎంకే, దాని మిత్రపక్షాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కూడా పాల్గొనాలని ఆశిస్తున్నామన్నారు.

ముక్కంటి క్షేత్రంలో యోగా





యోగాంధ్రలో భాగంగా బుధవారం శ్రీకాళహస్తిలోని రాజగోపురం వద్ద యోగాసనాలు వేశారు. ఎమ్మెల్యే సుధీర్, కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ.. యోగాంధ్రలో భాగంగా జిల్లాలో 9 లక్షల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. యోగా.. మన శరీరానికి మేలు చేయడంతో పాటు ఏకాగ్రతను పెంచడం, మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగిస్తుందన్నారు. జీవితంలో మార్పు.. ఆరోగ్యం కోసం రోజూ యోగాకు అరగంట కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, పర్యాటకశాఖ రీజనల్ డైరెక్టర్ రమణ ప్రసాద్, జిల్లా అధికారి జనార్దనరెడ్డి, ముక్కంటి ఆలయ ఈవో బాపిరెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, ఇతర అధికారులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

అలిపిరి చెక్‌పాయింట్ విస్తరణకు చర్యలు

- సమీక్షలో టీటీడీ ఈవో శ్యామలరావు

తిరుమల, జూన్18(ఆంధ్రజ్యోతి): తిరుమల క్షేత్ర భద్రత, భక్తుల సౌకర్యార్థం దృష్ట్యా అలిపిరి చెక్‌పాయింట్‌ను ఆధునిక సౌకర్యాలతో మరింత విస్తరించేందుకు చర్యలు చేపట్టినట్టు టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో బుధవారం ఆయన అదనపు ఈవో వెంకయ్య చౌదరి, వివిధ విభాగాల అధికారులతో సమీక్షించారు. తొలుత అలిపిరి చెక్‌పాయింట్ వద్ద ఆధునిక సౌకర్యాలు, పటిష్ట భద్రత తదితర అంశాలపై రాక్సా సంస్థ (జీఎంఆర్ గ్రూప్) పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చింది. తనిఖీలు, లగేజీ స్కానింగ్‌కు సమయం, సమస్యలపై అధికారులతో చర్చించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా మరింత వేగంగా వాహనాలు, లగేజీ స్కానింగ్ చేసేందుకు చర్యలు చేపట్టాలని రాక్సా సంస్థ ప్రతినిధులకు ఈవో సూచించారు. చెక్‌పాయింట్ వద్ద తనిఖీ సమయాన్ని తగ్గించేందుకు మార్గాలను సూచించాలన్నారు. టీటీడీ విజిలెన్స్ విభాగం లగేజీ స్కానింగ్‌లో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రానున్న రెండు దశాబ్దాల్లో భక్తుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని భద్రతాంశాలపై ప్రతిపాదించాలని రాక్సా ప్రతినిధులను కోరారు. ఆధునిక స్కానర్ల ఏర్పాటు, స్కానర్ల సంఖ్య పెంపుపై దృష్టిసారించాలన్నారు. ఎయిర్‌పోర్టు తరహాలో లగేజీ కన్వేయర్ బెల్ట్‌ల పొడవును పెంచి సమయాన్ని నివారించే అంశం పరిశీలించాలన్నారు. మరింతమంది భద్రతా సిబ్బందిని నియమించి తనిఖీలను సులభతరం చేయాలని సూచించారు. రాక్సా సీఈవో అమిత్ దార్, జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళీకృష్ణ, సీఈ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న ఈవో శ్యామలరావు

మామిడి రైతుకు మద్దతేదీ?

- తోతాపురి కొనింది రూ.3 వేలకే.. సాయంత్రం మరింత తగ్గింపు
- రోడ్డు పక్కన పారబోసిన రైతులు

ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకన్నా తక్కువకు కొంటే చర్యలు తీసుకుంటాం. ఇదీ కలెక్టర్ వెంకటేశ్వర్ చేస్తున్న హెచ్చరికలు. అయినా, మామిడి రైతులకు వ్యాపారుల నుంచి మద్దతు రావడం లేదు.

- పాకాల, ఆంధ్రజ్యోతి

మామిడికి మద్దతు ధరపై ప్రభుత్వ ప్రకటనలు, అధికారుల ఆదేశాలను గుజ్జు పరిశ్రమలు, ర్యాంపు యజమానులు, వ్యాపారులు పట్టించుకోవడం లేదు. వీరంతా సిండికేటుగా మారి బుధవారం ర్యాంపుల వద్ద కొనుగోళ్లను ఆపేశారు. దీంతో రైతులు పడిగాపులు గాస్తున్నారు. తోతాపురి టన్ను మద్దతు ధర రూ.8వేలు కాగా.. కనీసం రూ. 6వేలకైనా కొనాలని రైతులు ప్రాధేయపడుతున్నా వ్యాపారులు బేఖాతరు చేస్తున్నారు. చివరకు బుధవారం రూ.3వేలకు ధర పడిపోయింది. చీకటి పడ్డాక కొందరు రూ.1500కే కొనుగోలు చేశారు. మామిడి కోత కూలీ, రవాణాకుగాను టన్నుకు రూ.2500 ఖర్చవుతోందని రైతులు అంటున్నారు. చివరకు ఈ కూలి ఖర్చులూ రాక చేతినుంచి పడుతోందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. టన్ను రూ.2వేలకు కూడా కొనుగోలు చేయకపోవడంతో కొందరు కడుపుమండి ట్రాక్టర్లలో తెచ్చిన మామిడి కాయలను రోడ్డుపక్కన పడేసి వెళ్లిపోతున్నారు. ఇక, మరోవైపు గుజ్జు పరిశ్రమలకు ట్రాక్టర్లలో తీసుకెళ్తే అన్‌లోడింగ్‌కు రోజుల తరబడి వేచిచూడాల్సి వస్తోంది. దామలచెరువు పరిసరాల్లోని ర్యాంపుల యజమానులు ఒక్కటై ఇబ్బందులు పెడుతున్నారని రైతులు వాపోతున్నారు. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యేలు పులివర్తి నాని, జగన్మోహన్, మురళీమోహన్, కలెక్టర్ వెంకటేశ్వర్, ఉద్యాన శాఖ అధికారులు, మ్యాంగోనగర్‌కు వచ్చి వ్యాపారులతో, గుజ్జు పరిశ్రమల యజమానులు, ర్యాంప్ నిర్వాహకులతో చర్చించినా ఫలితం కనిపించలేదు.



రోడ్డు పక్కన రైతులు పడేసిన తోతాపురి కాయలు

కాగా, ఎస్పీ హర్షవర్ధనరాజు బుధవారం దామలచెరువులోని మ్యాంగోనగర్‌కు వచ్చి వ్యాపారులు, సప్లయర్లతో మాట్లాడారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి దశరథరామిరెడ్డి, మండల ఉద్యాన అధికారి శైలజ బుధవారం మ్యాంగోనగర్‌లో పర్యటించారు. గుజ్జుపరిశ్రమల యజమానులు, ర్యాంప్‌లవద్ద సప్లయర్లు, మండీ వ్యాపారులు తోతాపురి మామిడికాయలు కొనుగోలు చేసి రైతులకు సహకరించాలని కోరారు.

శాస్త్రోక్తంగా అక్షరాభ్యాసం

శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం అక్షరాభ్యాసం కార్యక్రమం శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయంలోని మేధో గురుదక్షిణామూర్తి సన్నిధిలో కలశ ప్రతిష్ఠ చేసి వేదపండితులు కార్యక్రమాన్ని నిర్వహించారు. తల్లిదండ్రులు పెద్దసంఖ్యలో తమ పిల్లలను ఆలయానికి తీసుకువచ్చి అక్షరాలు దిద్దించారు. ఎమ్మెల్యే సుధీర్ చిన్నారులకు పలక, బలపాలు అందజేసి వారి చేత అక్షరాలు దిద్దించారు. ఈ కార్యక్రమంలో ఈవో బాపిరెడ్డి, టీడీపీ నాయకులు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి



ఏడీజీపీ జయరామన్ సస్పెన్షన్ రద్దు చేయండి

- సుప్రీం కోర్టు ఆదేశం

చెన్నై, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లాలో బాలుడి కిడ్నాప్ వ్యవహారంలో ఏడీజీపీ జయరామన్ సస్పెన్షన్ ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని సుప్రీంకోర్టు ధర్మాసనం రాష్ట్ర పోలీసు శాఖను ఆదేశించింది. ఈ కేసులో ఏడీజీపీని అరెస్టు చేయాలంటూ హైకోర్టు ఉత్తర్వులను సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో జయరామన్ అప్పీలు పిటిషన్ వేశారు. ఆ పిటిషన్‌ను న్యాయమూర్తి ఉజ్జల్ భుయాన్ నాయకత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం అత్యవసర కేసుగా పరిగణించి బుధవారం ఉదయం విచారణ చేపట్టింది. ఆ సందర్భంగా ఏడీజీపీ జయరామన్‌కు బాలుడి కిడ్నాప్ వ్యవహారానికి ఎలాంటి సంబంధాలు లేవని, కనీసం ప్రతివాదిగానూ లేని ఆయనను ఎలా అరెస్టు చేశారో అర్థం కావడం లేదని ఏడీజీపీ తరఫు న్యాయవాది పేర్కొన్నారు. పోలీసులు ఏడీజీపీని అరెస్టు చేసి, మంగళవారం గంటల తరబడి విచారణ జరిపారన్నారు. ఏడీజీపీని అరెస్టు చేయలేదని, ఆయన్ని రోజంతా విచారణ మాత్రమే జరిపారని పోలీసు శాఖ తరఫు న్యాయవాది తెలిపారు. అరెస్టు చేయనప్పుడు ఏడీజీపీని ఎందుకు సస్పెండ్ చేయాల్సివచ్చిందో పోలీసుశాఖ గురువారం తమకు వివరణ ఇవ్వాలని ధర్మాసనం ఆదేశించింది. ఇక మద్రాసు హైకోర్టు ఏడీజీపీ అరెస్టుకు ఆదేశాలివ్వడం తమకు ఆశ్చర్యం కలిగించిందని, ఇలాంటి ఘటన ఇప్పటి వరకూ ఎక్కడా జరుగలేదని ఆశ్చర్యం వ్యక్తం చేసింది. ఆ తర్వాత కేసు విచారణను గురువారానికి వాయిదా వేసింది.

హోటళ్లలో ఐటీ తనిఖీలు

చెన్నై, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఐదు హోటళ్లలో ఆదాయపు పన్నుల శాఖ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. అన్నా నగర్, వేళచ్చేరి, తరమణి, ఓఎమ్మార్ సహా ఐదు ప్రాంతాల్లోని హోటళ్లలో ఈ సోదాలు జరిగాయి. కేరళ రాష్ట్రం తలచ్చేరి ప్రాంతానికి చెందిన కున్హీ మూసా అనే వ్యక్తి ఈ హోటళ్లను నడుపుతూ గత కొన్నేళ్లుగా ఐటీ రిటర్న్ సక్రమంగా దాఖలు చేయకుండా పన్ను ఎగవేతకు పాల్పడ్డారనే ఆరోపణలతో ఈ తనిఖీలు నిర్వహించినట్లు ఐటీ అధికారులు తెలిపారు.

హీరో ఆర్యా ఖండన..

ఇదిలా ఉండగా ఐటీ తనిఖీలు జరిగిన హోటళ్ల ప్రముఖ సినీనటుడు ఆర్యాకు చెందినవని తొలుత వార్తలు వెలువడ్డాయి. వెంటనే ఆర్యా ఓ ప్రకటన విడుదల చేస్తూ ఐటీ తనిఖీలు జరిగిన హోటళ్లు తనవి కావని ప్రకటించారు. ఆ హోటళ్లు తనకు చెందినవని ప్రసార మాధ్యమాల్లో వార్తలు వెలువడటం గర్హనీయమన్నారు.

కబిని డ్యాం నుంచి 25 వేల ఘనపుటడుగుల నీరు విడుదల

వాషర్‌మెన్‌పేట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రంలోని కావేరి నది పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న భారీవర్షాల కారణంగా ఆ రాష్ట్రంలోని కబిని డ్యాంకు భారీగా నీరు వచ్చి చేరుతోంది. 84 అడుగుల పూర్తి సామర్థ్యం కలిగిన కబిని డ్యాం నీటిమట్టం 80.14 అడుగులుంది. డ్యాంకు 21,545 ఘనపుటడుగుల నీరు వచ్చి చేరుతోంది. డ్యాం భద్రతా దృష్ట్యా డ్యాం నుంచి 25 వేల ఘనపుటడుగుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో, కావేరి నది పరీవాహక ప్రాంతాలకు వరద హెచ్చరికలు జారీచేశారు. ఈ నీరు మరో రెండు రోజుల్లో తమిళనాడు-కర్ణాటక సరిహద్దు ప్రాంతమైన పిల్లిగుండుకు చేరుకునే అవకాశముందని ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు.

వ్యాపారవేత్త భార్యను కట్టేసి దోపిడీ

- ఖాకీ సహా నలుగురి అరెస్టు

అడయార్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): తిరుపత్తూరు జిల్లా వాణియంబాడి నీలికొల్లై వీధికి చెందిన ఒక వ్యాపారవేత్త భార్యను కట్టేసి ఇంటిలో దోపిడీకి పాల్పడిన కేసులో ఒక పోలీస్ కానిస్టేబుల్‌తో సహా నలుగురు దోపిడీ దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు... ఇంతియాస్ అహ్మద్ (66) అనే వ్యక్తి తోళ్ళ పరిశ్రమ నడుపుతున్నారు. ఈయనకు భార్య సబితా గుల్షం (55)తో పాటు ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. వాణియంబాడికి చెందిన శక్తివేల్ (37) అనే వ్యక్తి వారింటిలో పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో మూడు రోజుల క్రితం నలుగురు ముఠా ఇంట్లో చొరబడి గుల్షంను కట్టేసి దోపిడీకి పాల్పడ్డారు. దీనిపై అహ్మద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వాణియంబాడి పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. సీసీ ఫుటేజీ ఆధారంగా దోపిడీకి పాల్పడిన చెన్నైకు చెందిన దోపిడీ ముఠా సభ్యులకు, శక్తివేల్‌కు సం బంధం ఉన్నట్టు గుర్తించారు. ఆ తర్వాత శక్తివేల్‌తో పాటు తిరుపతికి చెందిన శాంతకుమారి (34), ఇళవరసన్ (49) సహా నలుగురికి సంబం ధం ఉన్నట్టు గుర్తించి అరెస్టు చేశారు. దీనిపై పోలీసులు వివరిస్తూ, ఇంటి పని చేసే శక్తివేల్ ఖాళీ సమయాల్లో పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో జిల్లాలోని కొల్లకట్టై అనే ప్రాంతానికి చెందిన ఇళవరసన్‌తో పరిచయం ఏర్పడింది. వీరి మధ్య జరిగిన సంభాషణల్లో వ్యాపారవేత్త అహ్మద్ తన భార్యతో ఒంటరిగా ఉన్నట్లు ఇళవరసన్‌కు శక్తివేల్‌కు చెప్పాడు. ఆ తర్వాత వీరిద్దరూ కలిసి అహ్మద్ ఇంటిలో దోపిడీ చేయాలని అనుకున్నారు. ఈ నేపథ్యంలో ఇళవరసన్ తనకు బాగా తెలిసిన తిరుపతికి చెందిన శాంతకుమారితో కలిసి దోపిడీకి ప్లాన్ వేశారు. ఆ తర్వాత ఈ ముగ్గురు కలిసి తిరుమలలో పనిచేస్తున్న ఎస్పీఎఫ్ కానిస్టేబుల్ అరుణ్ కుమార్ సాయం కోరారు. ఆయన సలహా మేరకు శక్తివేల్, ఇళవరసన్, శాంతకుమారి కలిసి దోపిడీకి పాల్పడినట్టు వెల్లడించారు. అదేసమయంలో ఈ దోపిడీకి సలహా ఇచ్చిన ఎస్పీఎఫ్ కానిస్టేబుల్ అరుణ్ కుమార్‌ను తిరుపతి పోలీసుల సహకారంతో అదుపులోకి తీసుకుని, వాణియంబాకి తరలించి, ఈ దోపిడీ కేసులో ఇంకా ఎవరెవరికి సంబంధం ఉన్న అంశంపై విచారణ జరుపుతున్నారు. కేసు దర్యాప్తు జరుపుతున్నారు.



ఎస్పీఎఫ్ కానిస్టేబుల్ అరుణ్ కుమార్

తిరుపతి జిల్లాలో ముగ్గురిపై ఎలుగుబంట్ల దాడి

- ఒకరికి తీవ్రగాయాలు

వెంకటగిరి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా వెంకటగిరి మండలం పాలెంకోట సమీపంలోని వెలుగొండ అటవీ ప్రాంతంలో బుధవారం ముగ్గురిపై రెండు ఎలుగుబంట్లు దాడి చేశాయి. ఈ ఘటనలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. బాధితులు తెలిపిన ప్రకారం.. పాలెంకోటకు చెందిన కటారి అంకయ్య, కావడి మునెయ్య, వెంకటగిరి చెందిన మరొకరు వెదురు కర్రల కోసం వెలుగొండ అడవిలోకి వెళ్లారు. ఈ క్రమంలో రెండు ఎలుగుబంట్లు వీరిపై దాడి చేయడంతో కటారి అంకయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. వీళ్లతో పాటు వెళ్లిన కుక్క ఎలుగుబంట్లపై తిరగబడటంతో అవి వెళ్లిపోయాయి. వీరితో పాటు వెళ్లిన మరో వ్యక్తి ఎవరన్నది తెలియలేదు. కాగా, మునెయ్యను అటవీశాఖ అధికారులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది.